మన
# తొలివెలుగు
తెలుగు దినపత్రిక
www.manatolivelugu.in
RNI: TGBIL/26/A2289
CEO & Chief Editor : Vanga Nagaraj Reddy (Raju)
హైదరాబాద్ | బుధవారం 10 జూన్ 2026 | సంపుటి : 1 | సంచిక : 10 | పేజీలు : 8 | వెల : 2/-

## చివరి గంటలో కొనుగోళ్ల జోరు..

గడిచిన రెండు సెషన్లుగా ఇన్వెస్టర్లను కలవరపెట్టిన నష్టాల పరంపరకు మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో పాటు దేశీయంగా బ్యాంకింగ్ రంగంలో వ్యూహాత్మక కొనుగోళ్లు మార్కెట్లకు ఊరటనిచ్చాయి. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ (దీూజు ూవఅంవఞ) 394 పాయింట్లు పుంజుకొని 73,918.76 మార్కు వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ (చీూజు చీఱట్ఎ 50) కూడా 119 పాయింట్లు లాభపడి 23,242.10 వద్ద ముగిసింది. మధ్యాహ్నం సమయంలో కొంత లాభాల స్వీకరణ జరిగినప్పటికీ చివరి గంటలో కొనుగోలుదారులు ఆసక్తి చూపడంతో సూచీలు తిరిగి పుంజుకున్నాయి.



## రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించాం

- ధాన్యం సేకరణలో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని ప్రకటన
- పక్క రాష్ట్రాలు తమ కన్నా తక్కువ కొన్నాయని వెల్లడి

## నార్త్ జనానికి దూరమౌతున్న కాంగ్రెస్

- ముఖ్యంగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన, కేంద్రం నుంచి వచ్చే నిధులు, పన్నుల పంపిణీలో జరుగుతున్న అసమానతలపై ఆయన ఎక్కుపెట్టిన విమర్శలు జాతీయస్థాయిలో హాట్ టాపిక్‌గా మారాయి.
- ఒక జాతీయ పార్టీ తరఫున ముఖ్యమంత్రిగా ఉంటూ ఇలాంటి ప్రాంతీయ సెంటిమెంట్‌ను, ముఖ్యంగా ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వాదాన్ని లేవనెత్తడం వెనుక కాంగ్రెస్ పార్టీ మారుతున్న అంతర్గత రాజకీయ సమీకరణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.
- గత కొన్ని ఎన్నికల సరళిని పరిశీలిస్తే, ఉత్తరాది రాష్ట్రాలలో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో పుంజుకోలేకపోతోంది



హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల జాతీయ వేదికలపై దక్షిణాది ఆత్మగౌరవ వాదాన్ని అత్యంత అగ్రెసివ్‌గా వినిపిస్తూ దేశ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపారు. ముఖ్యంగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన , కేంద్రం నుంచి వచ్చే నిధులు , పన్నుల పంపిణీలో జరుగుతున్న అసమానతలపై ఆయన ఎక్కుపెట్టిన విమర్శలు జాతీయస్థాయిలో హాట్ టాపిక్‌గా మారాయి. మేము కేవలం పన్నులు చెల్లిస్తూ, ఢిల్లీకి సలాం కొట్టే ద్వితీయ శ్రేణి పౌరులం కాబోం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవేదన మాత్రమే కాదు.. ఒక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక జాతీయ పార్టీ తరఫున ముఖ్యమంత్రిగా ఉంటూ - మిగతా 3లో

## సరికొత్త రాజకీయ సమీకరణాలు

- పార్లమెంటులో 2/3 మెజార్టీ సాధించే దిశగా ఎన్డీఏ
- కీలక బిల్లుల ఆమోదానికి మోదీ సర్కార్ ప్లాన్?!
- టీఎంసీ ఎంపీల తిరిగుబాటుతో పాటు డీఎంకే ఎంపీల మద్దతు కోరే అవకాశం
- మోదీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వచ్చే వర్షాకాల సమావేశాల్లోనే మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం



హైదరాబాద్

తమిళనాడు, పశ్చిమ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నారు. ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల తిరుగుబాటు సరికొత్త సమీకరణాలకు తెరలేపింది. ఈ పరిణామాలు కేంద్రంలోని చీణూ ప్రభుత్వానికి భారీ ఊరటనిచ్చేలా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే మోదీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వచ్చే వర్షాకాల సమావేశాల్లోనే మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' వంటి కీలక బిల్లులను ఆమోదించుకునేందుకు చర్యలు - మిగతా 2లో

## దేశ భద్రతకు వ్యూహాత్మక సొరంగం

- జోజిలా టన్నెల్ చివరి బ్లాస్ట్ విజయవంతం
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మిస్తున్న జోజిలా టన్నెల్‌లో తుది బ్రేక్‌త్రూ పూర్తి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో చివరి బ్లాస్టింగ్ నిర్వహణ
- ఇప్పటికే 85 శాతం పనులు



## అయోధ్య రామమందిరానికి రూ.500 కోట్లకు పైగా విరాళాలు

- రోజుకు సగటున రూ.8 లక్షల ఆదాయం
- ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగినప్పటి నుంచి సుమారు 15 కోట్లకు పైగా ప్రజల ఆలయ సందర్శన
- ఒక్కో భక్తుడి నుంచి సగటున రూ.33 కంటే ఎక్కువ విరాళం





## భారత రాజకీయాల్లో అజేయ శకం..

- నెహ్రూ రికార్డు బద్దలు.. ప్రధాని మోదీ భావోద్వేగ పోస్ట్!
- భారత రాజకీయ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం లిఖించబడింది
- సరిగ్గా 12 ఏళ్ల క్రితం 2014 మే 26న దేశ ప్రధానిగా సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించిన నరేంద్ర మోదీ, నేడు అత్యంత అరుదైన చారిత్రక మైలురాయిని అధిగమించారు

## ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు



- సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మహిళాశక్తి సభ
- స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన సీఎం
- స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు

హైదరాబాద్

మన సంస్కృతి, సంప్రదాయంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి మహిళాశక్తిని ప్రపంచానికి చాటిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని తెలిపారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేశారు. జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో పాల్గొని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుందని అన్నారు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని పేర్కొన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారని, వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలని, ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనదని కొనియాడారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన చేస్తున్నామని అన్నారు. అమెరికాలో మహిళలకు - మిగతా 3లో

GOVERNMENT OF TELANGANA
ANTI-CORRUPTION BUREAU
HONESTY OBJECTIVITY SINCERITY

## రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ నివాసాల్లో ఏసీబీ సోదాలు

- భారీగా నగదు, బంగారం, వెండి స్వాధీనం
- ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలపై ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నివాసాల్లో ఏసీబీ సోదాలు
- హైదరాబాద్, నిజామాబాద్ నివాసాల్లో తనిఖీలు
- భారీగా నగదు, బంగారం, వెండి, ఆస్తుల పత్రాలు స్వాధీనం

హైదరాబాద్

ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలతో రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్ ప్రాంతాల్లో మొత్తం 15 చోట్ల ఏసీబీ తనిఖీలు కొనసాగిస్తోంది. ఇవాళ రాత్రి వరకు అవినీతి నిరోధక శాఖ అధికారుల సోదాలు కొనసాగే అవకాశం ఉంది. ఇవాళ ఉదయం 6 గంటల నుంచి ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి - మిగతా 3లో




## టెర్రర్ నెట్‌వర్క్‌పై ఎన్ఐఏ నజర్

- హరియాణా, పంజాబ్‌లోని 18 చోట్ల సోదాలు
- నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) దూకుడు
- పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాది షహజాద్ భట్టికి సంబంధించిన మూడు కేసుల్లో పంజాబ్, హరియాణాలో దాడులు
- పలు ఆధారాలు స్వాధీనం

# రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించాం

ధాన్యం సేకరణలో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించామన్న పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రూ.35,077 వేల కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. 65.91 లక్షల ఎకరాల్లో 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని, 52 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని కేంద్రం చెప్పిందని అన్నారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.



**53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు**

దేశంలో పండే వరిలో 61 శాతం తెలంగాణలోనే ఉందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పక్కరాష్ట్రం 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి మాత్రమే కొనుగోలు చేసిందని, యాసంగి పంటలో పక్క రాష్ట్రాలు తమ కన్నా తక్కువ కొన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని, రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని వివరించారు.

**ఉన్న ప్రతి వరి గింజను కొనుగోలు చేశాం**

20.86 కోట్ల గోనె సంచుల్లో 18 కోట్లు మాత్రమే ఉపయోగించామన్న మంత్రి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుటి నుంచి ఈ యాసంగి పంటలోనే ఎక్కువగా ధాన్యం సేకరించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమ కన్నా తక్కువ ధాన్యం సేకరించిందని, బీజేపీ పాలిత రాష్ట్రంలో కూడా ఇంత వరి సేకరణ చేయలేదన్నారు. పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రూ.1.35 లక్షల కోట్లు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో రైతులకు రూ.లక్ష కోట్లు ఇచ్చిందని తెలిపారు. వరి సేకరణలో కేంద్రం ఇచ్చిన టార్గెట్ కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తక్కువ కొనుగోలు చేసిందని పేర్కొన్నారు.

కేంద్రం ఇచ్చిన టార్గెట్ కంటే ఎక్కువగానే వరి సేకరించామని, రైతుల వద్ద ఉన్న ప్రతి వరి గింజను కొనుగోలు చేశామని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి కొనుగోలు చేసే వరిని కేంద్రం ఏటా తగ్గిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో వరి ఉత్పత్రి పెంచుతుంటే కేంద్ర మాత్రం కొనుగోలు చేయడం లేదని, కేంద్రం కోటా తగ్గించినా ఎంఎస్పీ ప్రకారం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. "దేశంలో పండే వరిలో 61 శాతం తెలంగాణలోనే ఉంది. పక్క రాష్ట్రం 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి మాత్రమే కొనుగోలు చేసింది. యాసంగి పంటలో పక్క రాష్ట్రాలు, తెలంగాణ కన్నా తక్కువే కొన్నాయి. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నాం. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించాం. రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చాం. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం"

# నార్త్ జనానికి దూరమౌతున్న కాంగ్రెస్

-మొదటిపేజీ తరువాయి

ఇలాంటి ప్రాంతీయ సెంటిమెంట్‌ను, ముఖ్యంగా ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వాదాన్ని లేవనెత్తడం వెనుక కాంగ్రెస్ పార్టీ మారుతున్న అంతర్గత రాజకీయ సమీకరణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత కొన్ని ఎన్నికల సరళిని పరిశీలిస్తే, ఉత్తరాది రాష్ట్రాలలో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో పుంజుకోలేకపోతోంది. అదే సమయంలో కర్ణాటక, తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలు కాంగ్రెస్‌కు ప్రధాన ఆర్థిక, రాజకీయ వనరులుగా మారాయి. ఉత్తరాదిపై ఆశలు వదులుకోకపోయినా, తమకు పెట్టని కోటగా మారిన దక్షిణాదిని మరింత పటిష్టం చేసుకోవాలనే వ్యూహంలో భాగంగానే రేవంత్ రెడ్డి చేత కాంగ్రెస్ అధిష్ఠానం ఈ తరహా వాయిస్ వినిపిస్తోందని భావించవచ్చు. ఈ మొత్తం వ్యవహారంలో రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణ ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా, దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన పిల్లర్ గా రూపాంతరం చెందుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన కేవలం జనాభా ప్రాతిపదికన జరిగితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యతను కోల్పోతాయని రేవంత్ రెడ్డి గణాంకాలతో సహా హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఆయన తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వంటి ఇతర దక్షిణాది నేతలకు లేఖలు రాస్తూ అందరినీ ఏకం చేసే ప్రయత్నం చేయడం ద్వారా ప్రాంతీయ పార్టీల కంటే తానే ఈ వాదాన్ని బలంగా మోయగలనని నిరూపించుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్' అంటే 50% సీట్లను జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50% సీట్లను ఆయా రాష్ట్రాల ఆర్థిక సహకారం ఆధారంగా కేటాయించాలనే డిమాండ్ ? ఆయన పొలిటికల్ మెచ్యూరిటీని చూపిస్తోంది. దీనివల్ల ఆయన కేవలం గుడ్డిగా కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం లేదని, ఒక నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది అటు జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ఇమేజ్‌ను దెబ్బతీయకుండా, ఇటు దక్షిణాది ప్రయోజనాలను కాపాడే సమతుల్య వ్యూహంగా ఉపయోగపడుతోంది. భవిష్యత్ రాజకీయాల కోణంలో చూస్తే, ఈ 'దక్షిణాది సెంటిమెంట్' రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఢిల్లీ పాలకుల నిర్ణయాల వల్ల దక్షిణాది రాజకీయంగా అణగారిపోతుందనే భయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రాంతీయ సెంటిమెంట్‌ను ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేయవచ్చు. అయితే, ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్‌కు ఈ వ్యూహం రెండు అంచుల కత్తి లాంటిదే. దక్షిణాదిలో ఈ వాదం మైలేజ్ ఇచ్చినప్పటికీ, ఉత్తరాది రాష్ట్రాలలో దీనివల్ల కాంగ్రెస్ మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో దక్షిణాది హక్కుల కోసం పోరాడే ఒక 'ఫైర్ బ్రాండ్' లీడర్‌గా రేవంత్ రెడ్డి జాతీయ స్థాయిలో తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటున్నారు.



మంత్రి పదవి ఇవ్వాలంటూ వినతులు

తెలంగాణకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు.. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీంతో భేటీ అయ్యారు. వీరిలో ప్రముఖంగా మునుగోడు ఎమ్మెల్యే, ఫైర్ బ్రాండ్ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన సుదీర్ఘ లేఖను రాహుల్‌గాంధీకి అప్పగించారు. తాను పార్టీకి ఎంత విధేయుడినో ఆయన వివరించారు. 15 పేజీల లేఖలో పలు వివరాలను ఆయన వెల్లడించినట్టు తెలిసింది త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందన్న చర్చల నేపథ్యంలో కోమటిరెడ్డి సహా.. సీనియర్ నాయకు లు రాహుల్‌తోభేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఒకసారి మంత్రివర్గాన్ని విస్తరించారు. అప్పట్లో అడ్లూరి లక్ష్మణ్ సహా.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు అవకాశం కల్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు ఈ కూర్పు జరిగింది. అయితే.. ఇప్పుడు మరోసారి విస్తరించాలని చూస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఎప్పటి నుంచో మంత్రి పీఠంపై ఆశలు పెట్టుకున్న కోమటిరెడ్డి మంత్రి పీఠం కోసం విస్తృ తంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రివర్గంలో సీటును ఆయన అత్యంత ప్రతిష్టాత్మకంగా కూడా భావి స్తున్నారు. గత ఆరు మాసాల నుంచి తన వ్యాఖ్యల ద్వారా మరింత వేడి పుట్టిస్తున్నారు. తనకు మంత్రి వర్గంలో ఎందుకు చోటివ్వరంటూ కోమటిరెడ్డి ప్రశ్నించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక, రాష్ట్ర నేతలతో పనికాదనుకున్న ఆయన.. నేరుగా ఢిల్లీ పెద్దలకే విన్నవించారు.

# ఖమ్మంలో దారుణం
# 12 ఏళ్ల బాలికపై లైంగిక దాడి

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 12 ఏళ్ల బాలికపై ఓ నరరూప రాక్షసుడు దారుణానికి ఒడిగట్టాడు. చిన్నారిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి, ఆ తర్వాత భవనం నాలుగో అంతస్తు పైనుంచి తోసేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఖమ్మం 2వ పట్టణ పోలీసుల వివరాల ప్రకారం అదే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద వృద్ధ దంపతులు కాపలా(వాచ్‌మెన్) పని చేస్తున్నారు. నెల రోజుల కిందట వారి 12 ఏళ్ల మనమరాలు వేసవి సెలవుల్లో ఇక్కడికి వచ్చింది. ఈ నెల 6వ తేదిన రాత్రి సమయంలో అపార్టుమెంటు పక్కన పడి ఉండటాన్ని ఆ దంపతులు గమనించారు. తీవ్రగాయాలతో స్పృహ లేకుండా ఉన్న బాలికను వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. ఆ చిన్నారీ 8వ తేదీ సాయంత్రం స్పృహలోకి రాగానే అసలేం జరిగిందని తల్లిదండ్రులు అడగగా నిజం బయటపడింది. అదే అపార్టుమెంటులో ఓ వ్యక్తి తనపై లైంగిక దాడి చేశాడని నాలుగో అంతస్తు పైనుంచి కిందకు విసిరేశాడని చెప్పినట్లు ఏసీపీ రమణమూర్తి తెలిపారు.

**తీవ్ర గాయాలు**

ఈ నెల 6న వారి 12 ఏళ్ల కుమార్తెపై అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఓ దుర్బుద్ధి కలిగిన వ్యక్తి లైంగిక దాడి చేశాడు. దీంతో భయపడిన బాలిక కేకలు వేసింది. ఆ చిన్నారిని నిందితుడు అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తు నుంచి కిందకు తోసేశాడు. దీంతో ఆ చిన్నారి కిందపడిపోయింది. వెన్నెముక, చేతులు, కాళ్లు, పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి.




విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆ బాలికను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

**ఆలస్యంగా వెలుగులోకి**

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే ఈ నెల 6వ తేదీన బాలికపై లైంగిక దాడి జరగగా, అది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. కేసు ప్రాథమిక దశలో ఉందని పూర్తి వివరాలు నిందితుడ్ని అరెస్టు చేసిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీపీ రమణమూర్తి చెప్పారు.

"నిన్న మాకు ఒక ఫిర్యాదు అందింది. 12ఏళ్ల చిన్నారిని అదే అపార్ట్?మెంట్?లో ఉండే వ్యక్తి లైంగిక దాడి చేసి బిల్డింగ్? పై నుంచి తోసేశారని చెబితే ప్రాథమికంగా కేసు నమోదు చేయడం జరిగింది. తర్వాత బాధితురాలిని మెడికల్?, మెజిస్ట్రేట్? ముందు ప్రవేశపెట్టి, భరోసాలో స్టేట్?మెంట్, మెడికల్ సాక్ష్యాల ప్రకారం కేసును ఫైనలైజ్ చేస్తాం. ఈ ఘటన జూన్ 6వ తేదీన జరిగింది. రెండ్రోజుల నుంచి ఆ బాలిక స్పృహలో లేదు. నిన్న రాత్రి స్పృహలోకి వస్తే ఆమె తల్లికి విషయం చెబితే ఆమె వెంటనే పోలీస్? స్టేషన్?కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే మేం పోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉంది. బాధితురాలి వివరాలను ఎవరూ బహిరంగపరచవద్దు. అది సుప్రీంకోర్టు గైడ్?లైన్స్?కి విరుద్ధం. అలా చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. నిందితుడిని 24 గంటల లోపు పట్టుకుంటాం. బాలిక పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. నిందితుడు డ్రైవర్?గా పనిచేస్తున్నాడు. వయస్సు 45 వరకు ఉంటుంది. పూర్తి వివరాలు అరెస్టు తర్వాత వెల్లడిస్తాం" – రమణమూర్తి, ఖమ్మం టౌన్ ఏసీపీ

## ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి

ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టిందని, భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకి దక్కుతుందని తెలిపారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తు చేశారు.

**మహిళలకు రిజర్వేషన్ల బిల్లు**

బీజేపీ పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లకు 2013లో సోనియాగాంధీ బిల్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.

**ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం**

ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు ఉంటుందని, మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును చెల్లించలేదని, మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు.

**మహిళలను కోటీశ్వరులను చేస్తాం**

ఆడబిడ్డలు ఉచితంగా బస్సులో పక్క ఊరు వెళ్లి చదువుకుంటున్నారని, ఫ్రీ బస్సు వల్ల స్కూళ్లల్లో ఆడపిల్లల డ్రాపవుట్లు తగ్గాయని తెలిపారు. అంబానీ, అదానీలకు పోటీగా పెట్రోల్ బంక్‌లు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని, హైటెక్‌సిటీ పక్కన రూ. వెయ్యి కోట్ల భూమిని మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి మహిళల చేతిలో ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలను ఏనాడైనా మహిళలు కట్టుకున్నారా? అని అడిగారు. తమ ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకుని మహిళలు ఈ సభకు వచ్చారని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు.

## రోడ్లు భవనాల శాఖ ఈఎన్‌సీ నివాసాల్లో ఏసీబీ సోదాలు

-మొదటిపేజీ తరువాయి

సోదాలు నిర్వహించారు. ఆర్ అండ్ బీ శాఖ ఈఎన్?సీ మోహన్? నాయక్ నివాసం, కార్యాలయం, ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో తనఖీలు చేపట్టారు. హైదరాబాద్‌లోని మియాపూర్ వసంత విహార్?లోని నివాసం, నిజామాబాద్ సహా 15 చోట్ల దాడులు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి వచ్చే కాంట్రాక్టులను తన స్నేహితులు, బంధువులకే ఇచ్చారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు.

**మొత్తం ఆస్తుల విలువ వందల కోట్లు**

మోహన్ నాయక్ నివాసంలో ఇప్పటి వరకు రూ.65 లక్షల నగదు, 10 గ్రాముల చొప్పున బరువున్న 15 బంగారు బిస్కెట్లు, బంగారం, వెండి లభించాయి. వీటితో పాటు హైదరాబాద్, నిజామాబాద్?లలో ఖాళీ స్థలాలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఇప్పటి వరకు ఏసీబీ అధికారులు గుర్తించారు. మొత్తం ఆస్తుల విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**నగదు, బంగారం సీజ్**

ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై మోహన్‌నాయక్ నివాసం, కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖకు చెందిన అనేక అనేక బృందాలు సోదాలు నిర్వహించాయని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్‌తోపాటు నిజామాబాద్‌లోనూ తనిఖీలు చేశామని వెల్లడించారు. నగదు, బంగారం, బంగారం బిస్కెట్‌లు సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఆస్తుల పత్రాలు కూడా గుర్తించామని తెలిపారు. "ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై మోహన్‌నాయక్ నివాసం, కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖకు చెందిన అనేక అనేక బృందాలు సోదాలు చేశాయి. హైదరాబాద్?తోపాటు నిజామాబాద్ లోనూ తనిఖీలు చేశాం. నగదు, బంగారం, బంగారం బిస్కెట్?లు సీజ్? చేశాం. ఆస్తుల పత్రాలు కూడా గుర్తించాం"

## రానున్న రోజుల్లో ఎల్‌నినో మరింత తీవ్రరూపం

నైరుతి రుతుపవనాల్లో తగ్గనున్న వర్షపాతం
ఎల్‌నినో పరిస్థితులపై బులెటిన్ విడుదల చేసిన ఇన్‌కాయిస్ శాస్త్రవేత్తలు
తగ్గనున్న నైరుతి వర్షాలు – పర్యావరణానికి, మత్స్య పరిశ్రమకు నష్టం
సానుకూల ఉష్ణోగ్రతలు బలహీనపడి తటస్థ స్థితి



గత నెలలో పసిఫిక్ మహా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చిన మార్పుల కారణంగా ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని, తాజాగా అవి తీవ్ర రూపం దాల్చాయని ఇన్‌కాయిస్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. వచ్చే రోజుల్లో మరింత తీవ్రతరం అవుతాయని పేర్కొన్నారు. ఈ నెల నుంచి వచ్చే సంవత్సరం వరకు ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతాయని తెలిపారు.

**ఎల్‌నినో పరిస్థితులపై బులెటిన్ విడుదల**

హైదరాబాద్ నగరంలోని భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవల కేంద్రం (ఇన్‌కాయిస్) ఎల్‌నినో పరిస్థితులపై సోమవారం తాజా బులెటిన్ విడుదల చేసింది. పసిఫిక్ మహా సముద్రం తూర్పు భూమధ్య రేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా పెరిగినట్లు భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవల కేంద్రం స్పష్టం చేసింది.

**మత్స్య పరిశ్రమకు భారీ నష్టాన్ని కలిగిస్తాయి**

ఎల్‌నినో ఏర్పడిన సందర్భంలో మన దేశంలో రుతు పవనాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఇన్‌కాయిస్ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అత్యధిక వర్షపాతం నమోదు అయ్యే నైరుతి రుతు పవనాల్లో ఈసారి వర్షపాతం తగ్గుతుందని వెల్లడించారు. సముద్ర పర్యావరణానికి కూడా నష్టం కలుగుతుందని తెలిపారు. ఉత్తర హిందూ మహా సముద్రంలో తీవ్రమైన, దీర్ఘకాలిక సముద్ర ఉష్ణ తరంగాలు (మెరైన్ హీట్ వేవ్స్) ఏర్పడతాయని తెలిపారు. ఇవి సముద్ర పర్యావరణ సమతుల్యతను దెబ్బ తీస్తాయని, మత్స్య పరిశ్రమకు భారీ నష్టాన్ని కలిగిస్తాయని, పగడపు దిబ్బలను నాశనం చేస్తాయని వివరించారు.

**సానుకూల ఉష్ణోగ్రతలు బలహీనపడి తటస్థ స్థితి**

2024–26 మధ్య రెండు సంవత్సరాల్లో పసిఫిక్ మహా సముద్ర ఉష్ణోగ్రతలు అనేక మార్పులకు గురయ్యాయి. 2024 సంవత్సరం మే నెలలో అంతకుముందు ఉన్న సానుకూల ఉష్ణోగ్రతలు బలహీనపడి తటస్థ స్థితికి చేరుకున్నాయి. గత ఏడాది మే నుంచి నవంబర్ నెల మధ్య పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలో సముద్ర అంతర్భాగంలో ఉష్ణోగ్రతలు దాదాపు 3 డిగ్రీల వరకు మారాయి. 2026 ఫిబ్రవరిలో పసిఫిక్ తూర్పు, మధ్య ప్రాంతాల్లో చల్లదనం తగ్గి, సముద్ర అంతర్భాగంలో ఉష్ణోగ్రత పెరగడం మొదలైంది. గత నెల 2026 పసిఫిక్ మహా సముద్రంలోని చల్లటి ఉష్ణోగ్రతలు పూర్తిగా మాయమై, ఉపరితల, అంతర్భాగ ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల కంటే అధికంగా పెరిగాయి. ఇది మధ్య పసిఫిక్ ప్రాంతంలో పూర్తి స్థాయిలో ఎల్‌నినో దశ ప్రారంభమైందని సూచిస్తోంది.

# వార్ ఎఫెక్ట్.. ఆహార సంక్షోభం



పశ్చిమాసియా యుద్ధం మరిన్ని కష్టాలను తీసుకొస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే చమురు, వంటగ్యాస్ సరఫరాకు ఎదురైన అవాంతరాలు, ప్రజల జీవితాలపై ప్రతికూల ప్రభావం వంటి పరిణామాలు చూశాం. ఇప్పుడు మరో ప్రమాదం పొంచి ఉన్నదని తెలుస్తున్నది. తాజాగా వ్యవసాయ, ఆర్థిక, ఆహార రంగాల నిపుణుల విశ్లేషణలు ఇందుకు బలం చేకూర్చుతున్నాయి. మరి ఆ ప్రభావం ఎలా ఉండబోతున్నది? అనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది. ఇది దేశంపై సుమారు రూ.3 లక్షల కోట్ల విలువైన నష్టాన్ని కలిగిస్తుందని అంచనా. దేశంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడుతాయని, ఫలితంగా కరవు పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా యుద్ధ ప్రభావం రూపంలో మరో కష్టం వచ్చి పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం కారణంగా అత్యంత కీలకమైన హొర్ముజ్ జలసంధి వద్ద నౌకా రవాణాకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దిగుమతులకు కీలకమైన మార్గం కావడంతో ఎరువుల సరఫరాపైనా ప్రభావం పడింది. అటు వర్షాభావం, ఇటు ఎరువుల కొరత కలిపి వ్యవసాయ ఉత్పత్తిపై ప్రభావం పడుతుంది కాబట్టి, మొత్తంగా ఆహార ద్రవ్యోల్బణం సంభవించవచ్చని నిపుణులు చెప్తున్నారు. భారత వ్యవసాయ మార్కెట్ రెండు కీలకమైన, అంచనా వేయలేని అంశాలపై ఆధారపడి ఉంటుది. ఒకటి ఆకాశం, రెండు సముద్రం. కానీ ఈ సంవత్సరం రైతులు రుతుపవనాల కోసం ఆకాశం వంక చూస్తుంటే, మార్కెట్ వర్గాలు 2000 కిలోమీటర్ల దూరంలోని సముద్ర మార్గంపై చూస్తున్నాయి. సాధారణంగా వ్యవసాయ, మార్కెట్ వర్గాలకు చెందిన ఎవరైనా మంచి వర్షాలు పడాలని కోరుకుంటారు, కానీ ఈ సారి హొర్ముజ్ జలసంధి వద్ద శాంతియుత పరిస్థితులు నెలకొనాలని కూడా ప్రార్థించాల్సిన అవాంచనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రపంచంలో అధికంగా ఎరువులు వాడుతున్న రెండో అతిపెద్ద దేశం.. భారత్. ముడి పదార్థాలు, తయారైన ఎరువుల కోసం భారత్ ప్రధానంగా విదేశాల నుంచి వచ్చే దిగుమతులపై ఆధారపడుతున్నది. వీటిలో ఎక్కువ భాగం హొర్ముజ్ జలసంధి మీదుగా రావాల్సి ఉంటుంది. కానీ పశ్చిమాసియా యుద్ధంతో హొర్ముజ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాబట్టి ఈ సారి వ్యవసాయ దిగుబడులు పడిపోయి, ఆహార ధరలు పెరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇదే సమయంలో భారత వాతావరణశాఖ (ఐఎండీ) గత వారం రుతుపవనాలపై కీలకమైన ప్రకటన విడుదల చేసింది. భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో బలపడుతున్నదని స్పష్టంచేసింది. 2026లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. పదేండ్లలో ఎప్పుడూ లేనంత స్థాయిలో తక్కువ వర్షాలు కురుస్తాయని నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతం వరి, మక్క, సోయాబీన్ పంట యాసంగి పంట నాట్ల సమయం. కాబట్టి ప్రభుత్వాలు తక్షణమే గ్లోబల్ టెండర్ల ద్వారా యూరియాను సమకూర్చుకోవాల్సిన అనివార్యమైన పరిస్థితి నెలకొన్నది. బ్లూంబర్గ్ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మొత్తం యూరియాలో పర్షియన్ గల్ఫ్ నుంచే 45 శాతం సరఫరా అవుతాయి. కాబట్టి ప్రపంచ వ్యాప్తంగా కూడా ధరలు పెరిగాయి. భారత్ ఇటీవల 25 లక్షల టన్నుల యూరియాను సాధారణం కంటే రెట్టింపు ధరతో కొనుగోలు చేసింది. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు పొదుపు మంత్రం సూచించారు. ప్రజలు పెట్రోల్, డీజిల్‌తో పాటు రసాయ ఎరువుల వాడకాన్ని కూడా తగ్గించాలని కోరారు. ప్రజలు రసాయనాల వాడకం తగ్గించి, సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని చెప్పారు. ప్రధాని చేసిన సూచన, దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతున్నది. బంగారం, ముడి చమురుతోపాటు విదేశీ రసాయనాల వల్ల కూడా భారతదేశ దిగుమతి బిల్లులు, వాణిజ్య లోటు గణనీయంగా పెరుగుతున్నాయి. ఎరువుల దిగుమతికి భారత్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో 27 బిలియన్ డాలర్లు వెచ్చించింది. పశ్చిమాసియా సంక్షోభం ఏడాది పొడవునా కొనసాగితే ఈ మొత్తం 33 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశమున్నది. మరోవైపు చమురు దిగుమతుల భారం కూడా పెరుగుతున్నది. ఒక బ్యారెల్ చమురు ధర 10 డాలర్లు పెరిగితే భారత దిగుమతి బిల్లుపై 18 బిలియన్ డాలర్ల అదనపు భారం పడుతుంది. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కరెంట్ ఖాతా లోటు జీడీపీలో 1.5 శాతం నుంచి 2 శాతం వరకు పెరిగే అవకాశమున్నది. విదేశీ కంపెనీల పెట్టుబడుల ఉపసంహరణ వల్ల మరో 17-18 బిలియన్ డాలర్ల అదనపు ఒత్తిడి ఏర్పడుతున్నది. దీంతో బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ లోటు 50 బిలియన్ డాలర్ల నుంచి 65 బిలియన్ డాలర్ల వరకు చేరే ప్రమాదమున్నది. అంటే, వరుసగా మూడో ఏడాది కూడా లోటులోకి వెళ్లే ఆందోళనకరమైన పరిస్థితి నెలకొన్నది. మరోవైపు డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ ఏడాది రూ.85 -- రూ.95కు పడిపోయింది. సంక్షోభం ఇలాగే కొనసాగితే రూ.100 మార్క్ దిశగా దూసుకెళ్లే పరిస్థితి కనిపిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో విదేశీ ఎరువుల కొనుగోలు ప్రభుత్వానికి ఓ సవాల్, ఆ భారం రైతులపై పడకుండా చూడటం మరో సవాల్. ఇటీవల పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల యూరియా, డీఏపీ దిగుమతి ధరలు మెట్రిక్ టన్నుకు దాదాపు 950 డాలర్లకు చేరాయి. అంటే, యుద్ధం కంటే ముందు ధరలతో పోల్చితే యూరియా 139 శాతం, డీఏపీ 39 శాతం పెరిగింది. ఎల్ఎన్‌జీ ధరలు ఎంఎంబీటీయూకు 20 డాలర్లు పెరిగాయి. దీంతో నెలవారీ సబ్సిడీ తగ్గి ధరలు అధికమయ్యాయి. ఈ అధిక ధరలు వర్షాకాలమంతా కొనసాగితే సుమారు రూ.40 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు భారం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. ఈ మొత్తం భారాన్ని అంచనా వేస్తే సుమారు రూ.3 లక్షల కోట్ల అదనపు వ్యయం కానున్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎరువులపై కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ వ్యయం రూ.2.75 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకు ఉంటుందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ అభిప్రాయం వ్యక్తంచేశారు. ఎరువుల ధరల పెరుగుదలతోపాటు దిగుమతుల కొరత కొనసాగితే రానున్న నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదమున్నది. హొర్ముజ్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులతో ప్రతినెలా 30 నుంచి 40 లక్షల టన్నుల ఎరువుల వాణిజ్యం నిలిచిపోయింది. ఈ సీజన్‌కు సరిపడా ఎరువులు ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు చెప్తున్నప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగితే రబీ నాటికి ఎరువుల సంగతి ఎలా అని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గితే పరిస్థితి మరింత దిగజారవచ్చు. 2023లో వర్షాల కొరతతో ఆహార ద్రవ్యోల్బణం 11.5 శాతానికి చేరింది. ఇప్పుడూ సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో ఆహార కొరత ఏర్పడి, ధరలు పెరిగే ప్రమాదం ఉన్నది.

# టీఎంసీ అంతర్విస్ఫోటనం!





ఎన్నికల ఫలితాలు వెలువడి పట్టుమని పాతిక రోజులు కాకుండానే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ)కి వీధుల్లో హింసతో మొదలైన ఎదురుదెబ్బలు ఇంకా ఆగలేదు. తాజాగా ఇండియా కూటమి సమావేశానికి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఢిల్లీ వచ్చిన సోమవారం నాడే ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు తిరుగుబాటు జెండా ఎగరేసి, తమదే అసలైన టీఎంసీ అనీ, ఎన్డీయేలో ఉంటామనీ స్పీకర్‌కు లేఖ రాశారు. వారి సంఖ్య 13 మాత్రమేనని పార్టీ చెబుతోంది. ఇప్పటికే టీఎంసీ శాసనసభా పక్షం చీలి, 58 మంది ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ నాయకత్వంలో వేరు కుంపటి పెట్టారు. తమనే ప్రధాన ప్రతి పక్షంగా గుర్తించమని స్పీకర్‌కు లేఖ రాశారు. స్థానిక సంస్థల్లో రాజీనామాలకూ, గోడ దూకుళ్లకూ కొదవే లేదు. 'స్ట్రీట్ ఫైటర్'గా పేరున్న మమత ఈ అరాచకాన్ని ఆపడానికి ప్రయత్నించకపోలేదు. కానీ అదేమీ ఫలితమివ్వలేదని తాజా పరిణామాలు చెబుతున్నాయి. ఫిరాయింపులనగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 'వైస్రాయ్ ఎపిసోడ్' అందరికీ గుర్తొస్తుంది. కానీ ఆ జాడ్యం 'వైస్రాయ్' కన్నా చాలా పాతది. 1967లో హరియాణాలో గయాలాల్ అనే స్వతంత్ర శాసనసభ్యుడు వారం రోజుల వ్యవధిలో మూడు పార్టీలు మారినప్పుడు 'ఆయా రాం... గయారాం' అనే నానుడి మొదలైంది. ఫిరాయింపులకు ఆయన ఆద్యుడు కాకపోవచ్చుగానీ, వాటితో ఆయన పేరు శాశ్వతంగా ముడిపడి పోయింది. కానీ గత రెండు దశాబ్దాలనుంచి గుంపుగా వెళ్లి అవతలి పార్టీతో అంటకాగే ఉదంతాలు లేదా సొంత పార్టీ పెట్టుకోవడం వంటివి చోటుచేసుకున్నప్పుడల్లా... ప్రభుత్వాలు కుప్ప కూలినప్పుడల్లా ఆ పాత నానుడి పోయి, 'వైస్రాయ్ ఎపిసోడ్' గుర్తుకురావటం మొదలైంది. 1995లో జరిగిన ఆ ఉదంతం వెన్నుపోటుకూ, విద్రోహా నికీ, నయవంచనకూ బండగుర్తుగా మారిపోయింది.

తన మామ స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా జిల్లా పర్యటనలో ఉండగా, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి, అప్పటి రెవెన్యూ మంత్రి చంద్రబాబు తన విధేయులైన అరడజను మంది ఎమ్మెల్యేలను వైస్రాయ్ హోటల్‌లో పోగేసి, టీడీపీ చీలిపోయిందంటూ బ్రహ్మాండం బద్దలయిన స్థాయిలో అనుకూల మీడియాలో ప్రచారం చేయించుకుని, ఎమ్మెల్యేలను మభ్యపెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి ఆ సంఖ్యను పెంచుకుంటూ పోయారు. ఆయన మిత్రుడు, నాటి స్పీకర్ యనమల రామకృష్ణుడు సరేసరి... సకల వ్యవస్థలూ చంద్రబాబుకు సాగిలపడటంతో ఎన్టీఆర్ అధికారాన్ని కోల్పోయారు. కొన్ని నెలల వ్యవధిలోనే మనోవ్యథతో కన్ను మూశారు. ఇప్పటి 'రెడ్‌బుక్'లా ఆ ఉదంతానికి బాబు పేరెట్టినట్టు లేరుగానీ... ఈనాటికీ సకల రాష్ట్రాల ఫిరాయింపుదార్లకూ అదే శిరోధార్యం. 2014లో 23 మంది ఎమ్మెల్యేలను ఖరీదు చేయటం సంగతలా ఉంచి... 2024లో ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ అధికారం నుంచి వైదొలగాక కొందరు ఎంపీలతో పార్టీకీ, పదవికీ రాజీనామాలు చేయించటంద్వారా మళ్లీ ఆయనే 'నైతికత' ముసుగులో కొత్త రకం చీడకు గేట్లు తెరిచారు. మహారాష్ట్రలో 2022లో ఫిరాయింపులతో శివసేన, ఎన్సీపీలు చతికిలబడి అప్పటి మహావికాస్ అఘాదీ(ఎంవీఏ) ప్రభుత్వం కుప్పకూలింది. ఇప్పుడు విపక్షంలో ఉన్నా టీఎంసీకి అదే దుఃస్థితి ఎదురైంది. ఇదంతా మమత స్వీయ తప్పిదాల ఫలితమా... బీజేపీ చూపే ఆకర్షణల వల్లనా అని చర్చించటం వృథా. రెండూ నిజమే కావొచ్చు. కానీ మమత తప్పిదాలుంటే అవి ఇప్పుడే గుర్తుకురావటం, బీజేపీ ఆకర్షణలు చూపితే పార్టీ అధికారం కోల్పోయాకే ఎగబడటం వింత. గత నెల 4న వెలువడ్డ ఫలితాల్లో 45.92 శాతం ఓట్లతో, 208 సీట్లతో బీజేపీ అధికారంలోకి రాగా... 40.68 శాతం ఓట్లు, 80 సీట్లతో తృణమూల్ అధికారం కోల్పోయింది. అంటే ఓట్లపరంగా పెద్ద వ్యత్యాసం లేదు. కానీ టీఎంసీ ఎమ్మెల్యేలూ, ఎంపీల్లో ఎంత అభద్రతాభావం! ఈ బాపతు ఫిరాయింపుల్ని అలా గోడదూకే వారిలో లోపించిన నైతికతగా మాత్రమే చూడటం సరికాదు. ఈ వికృత ధోరణుల్ని నిలదీసే కాలంపోయి... ఘనకార్యాలుగా, 'అపర చాణక్యం'గా అభివర్ణించే మీడియా వచ్చింది. ఇతర వ్యవస్థలూ తమకేమీ తెలియనట్టు నటిస్తున్నాయి. అందుకే ఈ గోడ దూకుళ్లు నిర్లజ్జగా సాగిపోతున్నాయి. కనుక పార్టీలు చీలిపోతే... ప్రభుత్వాలు పడిపోతే 'యూ టూ బ్రూటస్' అనుకుని ఆశ్చర్యపోవటం తప్ప ఎవరూ చేయగలిగింది లేదు.

మన తొలివెలుగు

# మోడీ సరికొత్త రికార్డ్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తాజాగా సరికొత్త రికార్డు సృష్టించారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన ప్రధాన మంత్రిగా ఇప్పటి వరకు ఉన్న అన్ని రికార్డులను ఆయన తిరగరాశారు. దేశంలో ఒక్క ఒక్కడుగా ఆయన చరిత్ర సృష్టించారు. గతంలో మాజీ ప్రధాని ఇందిర పేరిట ఉన్న రికార్డును కొన్నాళ్ల కిందట అధిగమించిన మోడీ.. ప్రస్తుతం ఆమె తండ్రి, భారత తొలిప్రధాన మంత్రి చాచా నెహ్రూను కూడా పాలనలో అధిగమించారు. దేశానికి ప్రధాన మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన నాయకుడిగా మోడీ సంచలన రికార్డును సొంతం చేసుకున్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి.. మోడీ.. దేశానికి ఎక్కువ కాలం ప్రధానిగా పనిచేసి నేత చరిత్ర సృష్టించనున్నారు. భారతదేశ రాజకీయ, పరిపాలనా చరిత్రలో 2026 జూన్ 10 ఒక సువర్ణ అధ్యాయంగా లిఖించబోతుంది. దేశాన్ని నిరంతరాయంగా అత్యధిక కాలం పాలించిన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న చారిత్రక రికార్డును ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజున అధికారికంగా అధిగమించనున్నారు. 2014 మే 26న తొలిసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇప్పటి వరకు నిరాఘాటంగా ఆ పదవిలోనే ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో దేశవ్యాప్తగా బీజేపీ ప్రభంజనం సృష్టించి.. మోడీ ప్రధాని అయ్యే అవకాశం కల్పించింది. ఇక, 2024లో బీజేపీకి ఒంటరిగా సీట్లు తగ్గినప్పటికీ.. మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ, జనసేన సహా.. అనేక చిన్నా చితకా పార్టీల మద్దతుతో మోడీ ముచ్చటగా మూడోసారి ప్రధాని పీఠాన్ని అలంకరించారు 12 ఏళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశం అనేక పరివర్తనలకు సాక్ష్యంగా నిలిచిందని, ఈ మార్పుల్లో ప్రధానమైనది పేద, అణగారిన వర్గాల ప్రజల సంక్షేమేనని అన్నారు. ప్రధాని మోడీ వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ, స్వచ్ఛ భారత్, పిఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలను ఉదహరించిన మోడీ, ప్రజలకు గౌరవం, అవకాశాలు దక్కేందుకు తమ ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతుందన్నారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ 'అంత్యోదయ' నుండి ప్రేరణ పొందిందని, దశాబ్దాలుగా వెనుకబడిన వారికి అభివృద్ధి ద్వారా వచ్చే ప్రయోజనాలు చేరేలా చూడటమే తమ లక్షమని ప్రధాని అన్నారు. పేదలకు మెరుగైన జీవన నాణ్యతను అందించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించడం కూడా ఆనందంగా ఉందన్నారు. లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు, డిజిటల్ వేదికల ద్వారా మద్దతు ప్రజలకు ప్రత్యక్షంగా, పారదర్శకంగా చేరుతోందన్నారు. 'ఇది లీకేజీలను తగ్గించింది, సామర్థ్యాన్ని మెరుగుపరిచింది మరియు పాలనపై నమ్మకాన్ని బలోపేతం చేసింది. ఈ విధంగా 'గరీబ్ కల్యాణ్' ను ముందుకు తీసుకెళ్లే ప్రయాణం మానవ సాధికారత దిశగా, మన వికసిత్ భారత్ కలను సాకారం చేసే దిశగా సమిష్టి ఉద్యమంగా మారింది' అని ప్రధాని పేర్కొన్నారు. 2024 పార్లమెంటరీ ఎన్నికలలో విజయం సాధించిన తరువాత, జూన్ 9,2024న మోడీ వరుసగా మూడోసారి దేశ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రెండవ పదవీకాలం 2019 మే 30న ప్రారంభమైంది. గతంలోనూ మూడు సార్లు ప్రధాని అయిన వారు ఉన్నా.. వరుసగా.. ప్రధాని కావడం, సుదీర్ఘకాలం వరుసగా పాలన సాగించే విషయాల్లో మోడీనే ఫస్ట్ నిలిచారు. 2014, మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీ నెల 10వ తేదీ నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు. ఇది దేశంలోనే అత్యధిక రికార్డు. 1952.. మే 13న దేశ తొలి ప్రధానిగా నెహ్రూ ప్రమాణం చేశారు. ఆయన 1964, మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోడీ తోసిపుచ్చి.. తానే సరికొత్త రికార్డును సృష్టించారు. 2బుధవారం నాటికి మోడీ 4,399 రోజులపాటు వరుసగా పీఎం సీటులో కూర్చున్న ఏకైక నేతగా నిలిచారు. ఇక, ఇందిరమ్మ విషయానికి వస్తే.. మధ్యలో ఓడినా.. మొత్తంగా 4077 రోజుల పాటు భారత దేశానికి ఏకైక మహిళా ప్రధానిగా పనిచేశారు. అయితే.. ఈ రికార్డును గత ఏడాదే మోడీ అధిగమించారు. 2025, జులై 25న 4,078 రోజుల నిరంతరాయ పాలన రికార్డును మోడీ నమోదు చేయడం గమనార్హం. భారతదేశం 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల దేశం. మన యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి, విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు భారతదేశ వృద్ధికి చోదక శక్తులుగా ఉన్నాయి. గత 12 సంవత్సరాలుగా, భారతదేశం 'సంస్కరించు, సాధించు, పరివర్తన చెందు' అనే నినాదంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రభుత్వ రాజకీయ సంకల్పంతో, ఈ సంస్కరణల రథం పూర్తి వేగంతో దూసుకుపోతోంది. నేడు భారతదేశానికి ప్రతిష్ట, విస్తృతి, డిమాండ్, స్థిరత్వం, అన్నింటికంటే ముఖ్యంగా 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం ఉన్నాయి. అందువల్ల, సంకల్పంతో కూడిన పెట్టుబడుల వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇక ఇప్పటి వరకు ప్రధాని మోదీ 44 అంతర్జాతీయ గుర్తింపులు సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో ఏదేశాధినేతకు దక్కని గౌరవం నరేంద్ర మోదీకి దక్కింది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశానికి పునాదులు వేయడం నెహ్రూ కాలపు అవసరమైతే.. భారీ ప్రభుత్వ ప్రణాళికల నుండి చురుకైన, సాంకేతికత ఆధారిత పంపిణీ వ్యవస్థ ద్వారా భారతదేశాన్ని ఒక అంతర్జాతీయ ఆర్థిక



# ఫ్యూచర్ సిటీని సందర్శించిన కాంగ్రెస్ నేతలు




**జూన్ 10న సీఎం రేవంత్ రెడ్డి రాక సందర్భంగా ఏర్పాట్ల పరిశీలన**

**ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపు**

**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్** : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జూన్ 10న ఫ్యూచర్ సిటీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్సిటీల ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను తెలంగాణ రాష్ట్ర ఐ.టి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి , మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఇతర ముఖ్య నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 10న సాయంత్రం 4 గంటలకు ఫ్యూచర్ సిటీలో జరిగే సీఎం రేవంత్ రెడ్డి సభను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం కేఎల్ఆర్ మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజక వర్గానికే మణిహారం ఫ్యూచర్ సిటి మారబోతుందన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి మణిహారంగా నిలిచే భారత్ ఫ్యూచర్ సిటీకి ప్రజలంతా తరలిరావాలని మంత్రి శ్రీధర్ బాబు సహా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. 10న సాయంత్రం 4 గంటలకు ఫ్యూచర్ సిటిలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్సిటీల ప్రారంభోత్సవాలను కనుల పండుగగా జరుపుకునేందుకు జనం, కాంగ్రెస్ శ్రేణులు స్వచ్ఛందంగా తరలిరావాలని కిచ్చెన్నగారు కోరారు.
ఉద్యోగ, ఉపాధి ఇచ్చే స్కిల్ యూనివర్సిటీ – పాలన సౌలభ్యం కోసం నిర్మించిన ఫ్యూచర్ సిటి డెవలప్మెంట్ అథారిటీ భవనాలు అందుబాటులోకి రావటం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా భావిస్తున్నట్లు కేఎల్ఆర్ తెలిపారు.

## బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం ముమ్మాటికి బీఆర్ఎస్ ఘనతనే

**బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కే.పీ వివేకానంద్**

**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించడం తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదు**




**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టీ. రమేష్** : సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి చౌరస్తాలో నూతనంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఫ్లై ఓవర్ ను బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కే.పీ వివేకానంద పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, నిర్లక్ష్య ధోరణిని ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాచుపల్లి ఫ్లై ఓవర్ నిర్మాణంతో పాటు హైదరాబాద్ మహానగర అభివృద్ధి ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, అలసత్వాన్ని అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రశ్నించినందుకే ఈ బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజల పక్షాన కొట్లాడి అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, ముఖ్యమంత్రి ఆగ మేఘాల మీద శంకుస్థాపనలు చేసి ఎక్కడో మియాపూర్ లో ఉంటూ బాచుపల్లి ఫ్లైఓవర్ ను ప్రారంభించడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమే అని అన్నారు. ఎస్ఎన్డీపీ, ఎస్ఆర్డీపీ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు హెచ్ – సిటీ అంటూ పేరు మార్చడం తప్పా చేసింది ఏం లేదని, ఈ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన ఇప్పటి వరకు సుచిత్ర – కొంపల్లి ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయలేకపోయిందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం నేపాన్ని నెట్టివేసి చేతులు దోచుకుంటున్నారే తప్పా చేసిందేమీ లేదని, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తన ఊహల నగరమైన ఫోర్త్ సిటీని ప్రచారం చేస్తూ ఉన్న నగరాన్ని ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విస్మరిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంతో పాటు హైదరాబాద్ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీయే రక్ష అని ఆయన అన్నారు.

## నిజాంపేట్ ఎస్ఎన్డీపీ పనులపై విజిలెన్స్ విచారణ జరపాలి

**బీజేపీ అధ్యక్షులు బిక్షపతి యాదవ్**



**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి. రమేష్ :** కమిషన్లకు కక్కుర్తిపడి ఎస్ఎన్డీపీ పనులు చేయడం ద్వారా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని బీజేపీ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ ఆరోపించారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ లో ఎస్ఎన్డీపీ పనుల నాణ్యత ప్రమాణాలలో లోపంతో పాటు నాలాల నిర్మాణం అనేది ఒక క్రమబద్ధంగా జరగడంలేదని ఆరోపించారు. అప్పుడున్న కమిషనర్ తో పాటుగా అధికారులకు ఎంత మొరపెట్టుకున్నా కూడా అసంబద్ధంగా పనులు పూర్తి చేయడమే కాకుండా కొన్ని పనులను మధ్యలోనే ఆపివేయడం ద్వారా ప్రజాధనం వృధా అవ్వడమే కాకుండా మళ్లీ వర్షం పడితే ఎక్కడ నీళ్లు అక్కడే ఆగి ఉండడం ద్వారా బండారి లేఔట్ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్పొరేటర్లుగా పదవిలో ఉన్నప్పుడు కమిషన్లకు కక్కుర్తి పడి పనులు అసంపూర్తిగా పూర్తి చేయడం వలన ఈ పరిస్థితి దాపురించిందని అలాగే ఎస్ఎన్డీపీ పనుల నిమిత్తం దాదాపు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ నుండి ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా వసూలైన రూ. 30 కోట్లు కార్పొరేషన్ చెల్లించడంపై కమిషన్ల రూపంలో అధికారులు, ప్రజాప్రతినిధుల చేతులు మారాయని ఆరోపించారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని అధికారులు సరైన చర్యలు వెంటనే తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నిజాంపేట మరియు బండారి లే అవుట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు.

## విద్యుత్ మెయింటెనెన్స్ స్పెషల్ డ్రైవ్



**మన తొలివెలుగు, చాంద్రాయణగుట్ట, ప్రతినిధి శైలేష్ కుమార్** ఫలక్‌నుమా విద్యుత్ సరఫరా సబ్ స్టేషన్, ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా ఛత్రినక శివగంగ నగర్ పరిధిలో విద్యుత్ సరఫరా వ్యవస్థపై విస్తృత మెయింటెనెన్స్ డ్రైవ్ చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన, లోడ్ బ్యాలెన్సింగ్, కరెంట్ లీకేజీల సరిచేత పనులు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో ముందస్తు సమాచారంతో తరచుగా వస్తున్న ఓవర్ ఓల్టేజ్, ట్రిప్పింగ్ సమస్యలకు పరిష్కారం చేయడమే మా బాధ్యత అని అధికారులు చెప్పుకొచ్చారు. స్థానికులు సూచించిన స్పాట్‌లపై ప్రత్యేక ఫోకస్ చేసి సమస్యలు పరిష్కారం చేస్తామని అధికారులు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో ఇ శివ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఇ), (ఏడిఇ) కే రాజు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్స్, లైన్ ఇన్స్పెక్టర్ రంగ రావు, సిబ్బంది సంతోష్ కుమార్ పాల్గొన్నారు. స్థానికులు అధికారులు స్పందించి వెంటనే పని ప్రారంభించారని హర్షం వ్యక్తం చేశారు. అధికారుల విజ్ఞప్తి మేరకు టీజీఎస్పీడీసీఎల్, విద్యుత్ సమస్యలు ఉన్నవారు హెల్ప్ లైన్ 1912 లేదా సంబంధిత సబ్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

## నత్తను తలపిస్తున్న రోడ్డు విస్తరణ పనులు..!

**ఛత్రినాక చౌరస్తాలో జీహెచ్ఎంసీ పనుల వల్ల ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్**

**గుంతల్లో వాహనాలు చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు**

**తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టిన ట్రాఫిక్ పోలీస్**

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు**




**మన తొలివెలుగు, చాంద్రాయణగుట్ట, ప్రతినిధి శైలేష్ కుమార్** పాతబస్తీలో రోడ్డు విస్తరణ పనులు నత్తను తలపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఛత్రినాక చౌరస్తా వద్ద కొనసాగుతున్న జీహెచ్ఎంసీ డ్రైనేజీ మరియు రోడ్ మరమ్మత్తు పనుల కారణంగా ప్రతి రోజు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రద్దీ సమయంలో చౌరస్తా దాటేందుకు 15 –20 మినిషాలు పడుతోంది. స్కూల్ బస్సులు, అంబులెన్స్‌లకు కూడా దారి లేక ఇబ్బందిగా మారింది. పాదచారులు నడవాలన్న రోడ్లపై బురద పేరుకుపోయి నడవలేకపోతున్నారు. ట్రాఫిక్ జామ్ వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయంపై మన తొలివెలుగు ప్రతినిధి శైలేష్ కుమార్ నేరుగా చార్మినార్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కే. లక్ష్మణ్, ఛత్రినక ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. సంతోషం దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన పోలీస్ అధికారులు స్వయంగా స్పాట్‌ను పరిశీలించారు. రోడ్లపై పేరుకుపోయిన బురద నీరు నిల్వ ఉండడాన్ని గమనించిన ట్రాఫిక్ పోలీస్ అధికారులు టిప్పర్ల ద్వారా తాత్కాలికంగా మట్టి పోయించి రోడ్డును వినియోగంలోకి తెచ్చారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా సమస్య పరిష్కారమైన, వీలైనంత త్వరగా సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఇఇ) ఉషతో చర్చించారు. పనులను రాత్రి సమయంలో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన పోలీస్ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఒక్క బండరాయి దొర్లినా.. ప్రాణాలు హరి..!

**ఇంజాపూర్ రోడ్డులో ప్రమాదకరంగా దూసుకెళ్తున్న టిప్పర్లు**

**నంబర్ ప్లేట్ ఉండదు.. వెనక భాగంలో భాగంలో డోర్ ఉండదు.**

**ఆర్టీఏ, పోలీస్, ఇరిగేషన్ అధికారులకు ముడుపులు.. ప్రజల ప్రాణాలతో చెలగాటాలు..!**



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో టిప్పర్లు ప్రమాద కరంగా ప్రయాణిస్తున్నాయి. పెద్ద పెద్ద బండ రాళ్లను గత కొద్ది రోజుల నుంచి టిప్పర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాగా డ్రైవర్లు కనీస జాగ్రత్తలు తీసుకోకపోడం, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు రహదారులపై నడవడం, వాహనాల వెనుక భాగం డోర్లు కూడా లేకపోవడంతో బండ రాళ్లు రోడ్డుపై పడి ఆ సమయంలో అటువైపు ప్రయాణించే పాదాచారులు గాని, వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఎన్నిసార్లు హెచ్చరించినా వాహన యజమానులు పట్టించుకోవడం లేదనే స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీఏ, పోలీస్ అధికారులు స్పందించి అప్పుడప్పుడు ప్రధాన రహదారులపై కాకుండా గ్రామాలలో వెళ్లే రహదారిలో కూడా చెక్ చేస్తే ఇలాంటి ప్రమాదకర వాహనాలను పట్టుకొని సీజ్ చేయవచ్చు. దీంతో ప్రమాదకరమైన టిప్పర్ల ప్రయాణం నుంచి ప్రజలను రక్షించవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలాంటి ప్రమాదకరంగా ప్రయాణించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఫ్యూచర్ సిటీ.. రాబోయే తరాలకు బంగారు దివిటీ

**కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ ఎర్ర చంద్రమోహన్**



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య** ఫ్యూచర్ సిటీ రాబోయే తరాలకు బంగారు బాటలు వేసే దివిటీ అని మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా ఇంచార్జ్ ఎర్ర చంద్రమోహన్ స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో బుధవారం జరిగే సీఎం సభను విజయవంతం చేయడానికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి భారీగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని మహేశ్వరం నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ ఎర్ర చంద్రమోహన్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు రాబోయే తరాలకు బంగారు భవిష్యత్తును అందించే దిశగా వేగంగా అడుగులు వేస్తోందన్నారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాకుండా దేశానికే తలమానికంగా నిలిచే ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటుందన్నారు. డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. లక్షలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందని, ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో తెలంగాణ దశ దిశ మారనుందని అన్నారు. ఫ్యూచర్ సిటీలో 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు జరిగే సీఎం సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయడం, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని, మహేశ్వరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సీఎం బహిరంగ సభకు వేలాదిగా తరలిరండి



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** ఫ్యూచర్ సిటీలో 10న జరిగే సీఎం బహిరంగ సభకు వేలాదిగా తరలివెళ్ళి విజయవంతం చేద్దామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడ్ల శ్రీనివాస్ మహారాజ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం లో ఫ్యూచర్ సీటీ డెవలప్ పనులను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ పరిశీల కోసం విచ్చేసిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుని, కేఎల్ఆర్ ని గుడ్ల శ్రీనివాస్ మహారాజ్ , పుట్టగాళ్ల జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివగళ్ల యాదయ్య, గణేష్ తదితరులతో కలిసి ఘనంగా సన్మానం చేసి స్వాగతం పలికారు. 10న జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ కు ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి సభ ను విజయవంతం చేయాలని గుడ్ల శ్రీనివాస్ మహారాజ్ కోరారు.

## ఇంటి నుంచి బయట వెళ్లిన మహిళ అదృశ్యం



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** ఇంట్లో సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోహెల్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని బిస్మిల్లా కాలనీ లో నివాసం ఉండే షహీన్ బేగం ( 42) గృహిణి. ఈ నెల 7 న సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయి తిరిగిరాలేదు. ఆమె భర్త వసీముల్లా ఖాన్ బంధువుల దగ్గర చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో బాలాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు మిక్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అర్ అండ్ బీ ఈఎన్సీ ఇంటిపై ఏసీబీ దాడులు

**హైదరాబాద్ :** ఆర్.అండ్.బి. ఈ ఎన్ సి అధికారి మోహన్ నాయక్ పై ఏసీబీ దాడులు జరిపింది. మంగళవారం ఉదయం నుంచి మియాపూర్ లోని మోహన్ నాయక్ నివాసం లో సోదాలు కొనసాగుతున్నాయి. మోహన్ నాయక్ ఇంటి తో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఉదయం నుండి దాడులు జరుగుతున్నాయి. మియాపూర్ లోని వసంత సిటీ విల్లా నెంబర్ 98 లో మోహన్ నాయక్ వుంటున్నారు.

# గోదాములు సరిపోక.. మార్కెట్‌లోనే పంట

**వర్షంతో పంట ఉత్పత్తులు తడిసి అవస్థలు పడుతున్న రైతులు**
**పంట తరలింపులో తీవ్ర జాప్యం.. నష్టపోతున్న అన్నదాతలు**
**బీఆర్ఎస్ హయాంలోనే రూ.22.50 కోట్లతో తొమ్మిది గోదాముల నిర్మాణం**




**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ద్వారా పంటలు కొనుగోలు చేస్తున్నా.. వాటిని నిల్వ చేసుకొనేందుకు గోదాములు లేకపోవడంతో మార్కెట్ యార్డుల్లోనే పేరుకుపోతున్నాయి. జొన్న కొనుగోళ్లు ముగియగా.. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో 50 వేల క్వింటాళ్లకు పైగా జొన్న సంచులు నిల్వ ఉన్నాయి. ప్రభుత్వం కొనుగోలు చేసిన సోయా, కంది, శనగ, మక్క, జొన్న పంటలను సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ, ఇతర గోదాముల్లో భద్రపరుస్తుంది. వానకాలం, యాసంగిలో కొనుగోలు చేసిన పంటలతో గోదాములు నిండిపోయాయి. 1.12 లక్షల ఎకరాల్లో జొన్న సాగవగా.. 6 లక్షల క్వింటాళ్ల పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసింది. ఈ పంటను నిల్వ చేసుకొనేందుకు ప్రభుత్వ గోదాములు సరిపోక.. ప్రైవేటు గోదాములను కిరాయికి తీసుకున్నారు. ప్రైవేటు గోదాములు కూడా నిండిపోగా మార్కెట్ యార్డుల్లో పంట నిల్వలు ఉన్నాయి. దీంతో అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు గోదాముల కోసం వెతుకుతున్నారు. వానకాలం ప్రారంభమవగా.. జిల్లాలో వర్ష సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించించిన నేపథ్యంలో పంట తడిసిపోయి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులు

**రూ.22.50 కోట్లతో తొమ్మిది గోదాములను నిర్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వం**

రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిల్వ చేసుకొనేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందు లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రూ.22.50 కోట్లతో తొమ్మిది గోదాములను నిర్మించింది. 45 వేల మెట్రిక్ టన్నుల పంటలను నిల్వ చేసుకొనే సామర్థ్యం ఉన్న ఈ గోదాములు రైతులకు ఉపయోగపడుతున్నాయి. ఇచ్చోడ మా ర్కెట్ యార్డులో రూ.1.50 కోట్లతో 2500 మె ట్రిక్ టన్నుల నిల్వగల గోదాం, నార్నూర్‌లో రూ. 3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నులు, బేలలో రూ.3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నులు, బోథ్‌లో రూ.3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నులు, తలమడుగులో రూ.3 కోట్లతో 5 వేల మెట్రి క్ టన్నులు, తాంసి మండలంలోని బండల నాగాపూర్‌లో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు, ఇంద్రవెల్లి మండలం ధనోరలో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు, గుడిహత్నూర్ మండలం కొల్హారిలో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు, ఉట్నూర్‌లో రూ.3 కోట్లతో 5వేల మెట్రిక్ టన్నులు సామర్థ్యం గల గోదాముల నిర్మాణాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. ప్రస్తుతం ఈ గోదాములు రైతులకు ఉపయోగపడుతున్నాయి.

# వేగంగా సర్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు




**నిర్మల్ :** ఓటర్ల జాబితా ప్రక్షాళనకు కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా రెండు రోజుల క్రితం అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో అర్హులైన ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, ఓట్ల తొలగింపు ప్రక్రియలు చేపట్టనున్నారు. అన్ని సవరించిన తర్వాత కొత్త ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)కు శ్రీకారం చుట్టింది. ప్రతి 25 ఏళ్లకు ఒకసారి ఎన్నికల సంఘం ఈ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపడుతున్నది. గతేడాది నవంబర్ నుంచే ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను ప్రారంభించగా, ఇప్పటి వరకు 80 శాతం పూర్తయింది. అత్యధికంగా ముథోల్ నియోజకవర్గంలో 80.74శాతం పూర్తికాగా, నిర్మల్ నియోజకవర్గంలో 80.20శాతం, ఖానాపూర్ నియోజకవర్గంలో 78శాతం మ్యాపింగ్ పూర్తయింది. ప్రతి పోలింగ్ బూత్‌లో 1000–1200 మంది ఓటర్లు ఉండే విధంగా చూసి మ్యాపింగ్ చేస్తారు. ఈ మ్యాపింగ్ ప్రకారం ఆయా బూత్‌స్థాయి అధికారి ఇంటింటికీ వెళ్లి ఓటరు అర్హతలను పరిశీలించి నిర్ధారిస్తారు. 2002కు ముందు పుట్టిన ఓటరు నమోదుపై తండ్రి, కుటుంబ సభ్యులు, రక్త సంబంధీకుల ధ్రువీకరణలను పరిశీలిస్తారు. ఇందుకోసం 12 ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి చూపించాలి. అలాంటి రుజువులు చూపితేనే ఓటరు జాబితాలో ఓటరుగా కొనసాగుతారు. ఒకవేళ సరైన ధ్రువ పత్రాలు లేకుంటే నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగిస్తారు. అలాగే రెండు చోట్ల ఓట్లు ఉన్నవారిని, మరణించిన వారి పేర్లను తొలగించడానికి చర్యలు చేపట్టనున్నారు. ఈ నెల 15వ తేదీలోగా 100 శాతం మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత ఇంటింటికీ తిరిగి ఓటర్ల సమగ్ర విచారణ(సవరణ) కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు నెల రోజులపాటు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కొనసాగనున్నది. కలెక్టర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్, డీఆర్వోలు మ్యాపింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తూ ఈఆర్వో, ఏఈఆర్వోలకు అవసరమైన సూచనలు ఇస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో)లు పర్యవేక్షిస్తుండగా, మండలాల్లో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఏఈఆర్‌వో)లు బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత జూలై 31న ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే, వాటిని కూడా సరిచేసి అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

**పార్టీల వారీగా ఏజెంట్ల నియామకం**

ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా, పారదర్శకతతో రూపొందించేందుకు పోలింగ్ కేంద్రాల వారీగా ఏజెంట్లను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు అనుమతించింది. నిర్మల్ జిల్లాలో మొత్తం 925 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 925 మంది బీఎల్‌వోలు మ్యాపింగ్‌లో పాల్గొన్నారు. అలాగే ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్ వంతున ఆయా పార్టీలు తమ కార్యకర్తలను నియమించుకున్నాయి. వారి పరిధిలో ఓటరు మ్యాపింగ్, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అభ్యంతరాలు, ఓటర్ల తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించి తప్పులు, సూచనలు ఉంటే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.

**కేటగిరీలవారీగా ఓటర్ల జాబితా**

నిర్మల్ జిల్లాలో తాజా లెక్కల ప్రకారం మొత్తం 7,55,905 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,63,745 మంది, మహిళలు 3,92,110, ఇతరులు 50 మంది ఉన్నారు. నియోజకవర్గాలవారీగా చూస్తే ఖానాపూర్‌లో 2,30,338 మంది, నిర్మల్‌లో 2,64,314 మంది, ముథోల్‌లో 2,61,253 మంది చొప్పున ఉన్నారు.
ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ఓటర్ల జాబితాను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి మ్యాపింగ్ నిర్వహిస్తున్నారు. ముందుగా 2025 ఓటరు జాబితాను 2026 జాబితాతో పోల్చుతున్నారు.
ఏ కేటగిరీలో 2002, 2025 ఓటరు జాబితాల్లో పేర్లు ఉన్న వారిని గుర్తిస్తున్నారు. బీ కేటగిరీలో 1987, జూలై ఒకటవ తేదీ కంటే ముందు జన్మించిన(38 సంవత్సరాల కిందట) వారిని గుర్తించి వివరాలు నమోదు చేస్తున్నారు. సీ కేటగిరీలో 1987 నుంచి 2001 మధ్య జన్మించిన వారిని గుర్తిస్తున్నారు. డీ కేటగిరీలో 18 నుంచి 21 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారి వివరాలు నమోదు చేస్తున్నారు.
ఇలా ఓటర్ల వివరాలన్నీ బీఎల్ఓలు మొబైల్ యాప్‌లో మ్యాపింగ్ చేస్తున్నారు.

## దొంగతుర్తి వద్ద లారీ-బైక్ ఢీ.. యువకుడికి తీవ్ర గాయాలు



**ధర్మారం :** లారీ–బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన ఎల్లంకి అనిల్ (32) అని యువకుడు ద్విచక్ర వాహనంపై ఓ పని మీద ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి వచ్చాడు. పని ముగిసిన అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీ రోడ్డు నుంచి గ్రామపంచాయతీ వద్ద ఉన్న సమ్మక్క రోడ్డు మీదుగా వస్తున్న క్రమంలో పెద్దపల్లి -- ధర్మారం ఆర్ అండ్ బి రోడ్ ధర్మారం నుంచి పెద్దపల్లి వెళుతున్న లారీ అకస్మాత్తుగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో సదరు యువకుడు ద్విచక్ర వాహనంపై నుంచి పట్టడంతో అతని తలకు దెబ్బ తగలడంతో తీవ్రమైన రక్తస్రావం జరిగింది. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స కోసం పెద్దపల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ అతని పరిస్థితి నిలకడగా లేకపోవడంతో పెద్దపల్లి నుంచి అనిల్ ను కరీంనగర్ కు మెరుగైన చికిత్స కోసం తరలించారు. అనిల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ప్రమాదానికి గల కారణాలు సేకరిస్తున్నట్లు ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## ఇస్రో సందర్శనకు గోదావరిఖని బుడతడు.. చైర్మన్‌ను కలిసే అవకాశం



**కోల్ :** బెంగుళూరులోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను సందర్శించడానికి గోదావరిఖని తిలక్ నగర్ కు చెందిన రాకం కిరణ్–శ్వేత దంపతుల కుమారుడు రిశ్విక్ కు ఆహ్వానం లభించింది. అంతర్జాతీయ సంస్థ ఇస్కాన్ గత ఫిబ్రవరి 3న ఆన్లైన్లో నిర్వహించిన ప్రపంచ స్థాయి భగవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్ లో రిశ్విక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, 95 శాతం కంటే అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జూమ్ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధి ప్రేమ్ రాజ్ చైతన్య రిశ్విక్ కు బహుమతిగా సైకిల్ తోపాటు ప్రశంసా పత్రంను అందజేశారు. ఈనెల 12న బెంగుళూరులోని ఇస్రోను సందర్శించడానికి, నేషనల్ టాపర్స్ అవార్డు సెరిమనీలో పాల్గొనడానికి ఆహ్వానం పంపించారు. ఇస్రో చైర్మన్, ఏరో నాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ సోమనాథ్ ను కలిసే అవకాశంతోపాటు ఆయనతోపాటు గ్రూప్ ఫొటో, డమ్మీ రాకెట్ లాంచింగ్ డెమోను తిలకించడానికి తల్లిదండ్రులతో కలిసి రిశ్విక్ బెంగుళూరు బయలుదేరి వెళ్లాడు. కాగా, గోదావరిఖని కృష్ణవేణి పాఠశాలలో రిశ్విక్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

## భవన నిర్మాణ కార్మికుల శ్రమకు గుర్తింపునివ్వాలి

బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కే.పీ వివేకానంద్



**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టీ. రమేష్ :** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్, సుభాష్ నగర్ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కే.పీ వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న ఖర్చులు, నిర్మాణ వ్యయంతో పాటు భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల శ్రమను గుర్తించి పనికి తగ్గ వేతనాన్ని అందించాలని తెలిపారు. అలాగే వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ సుభాష్ నగర్ కమిటీ అధ్యక్షులు పి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పి. వెంకయ్య, సెక్రటరీ వి. శ్రీనివాస్, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ఘటనలో తొమ్మిదికి చేరిన మృతుల సంఖ్య

**విశాఖపట్నం :** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. మరో ఆరుగురు కార్మికులకు గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. సోమవారం నాడు సాయంత్రం 1500 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉన్న 150 టన్నుల మోల్టెన్ మెటల్ లాడెల్ పేలిపోయి, దాదాపు 25 అడుగుల విస్తీర్ణంలో హాట్ మెటల్ ఎగసిపడింది. ఘటన సమీపంలో ఉన్న కార్మికుల మీద హాట్ మెటల్ పడడంతో, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ప్రాణాలు తొమ్మిది మంది కోల్పోయారు. మృతులు: గోల్డ్ కుమార్ (మేనేజర్) జీవీ అప్పారావు (సైడ్ ఆపరేటర్) ప్రభాకరరావు (స్టాండ్ 3 ఆపరేటర్) జి.భానుకుమార్ (షిఫ్ట్ ఇన్చార్జి, స్టాండ్–అ) కృష్ణ నాగు (స్టాడ్ -4 ఆపరేటర్) రమణ (పౌడర్ కలాసీ–కాంట్రాక్ట్ వర్కర్) త్రినాథ్ (స్టాండ్ ఆపరేటర్–కాం ట్రాక్టు వర్కర్) ఎన్. అప్పలరాజుగా (స్టాండ్ ఆపరేటర్– కాంట్రాక్టు వర్కర్) గుర్తుతెలియని మరో వ్యక్తి
క్షతగాత్రులు: పైడిరాజు రావూరి మల్లికార్జునరావు పల్లెల శ్రీనివాస్ అర్జున్ అప్పారావు సత్యానంద్ సూరిబాబు స్టీల్ మెల్టింగ్ షాప్) నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడంతోనే ఈ ప్రమాదం జరిగిందని కార్మికుల ఆరోపణలు. ఇదే ?ాటూ?1లో మెటల్ రన్సింగ్ ప్రక్రియ సరిగ్గా చేయక గత నాలుగు రోజుల కింద హాట్ మెటల్ ఎగసిపడిందని, కానీ ప్రమాద తీవ్రత ఎక్కువగా లేదని, ఆరోజే జాగ్రత్త పడి ఉంటే ఇంత పెద్ద ప్రమాదం జరిగేది కాదని చెప్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం ప్రకటిచారు.

## గంజాయి మత్తులో యువకుల వీరంగం

**సత్తెనపల్లి :** గంజాయి మత్తులో యువకుతు వీరంగం సృష్టించారు. ఒక మహిళతో వాగ్వాదం చేసారు. వలస కూలీపై విచక్షణారహితంగా దాడి చేసారు. దాడికి పాల్పడిన యువకులు జనసేన కార్యకర్తలుగా స్థానికులు చెబుతున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని దమ్మాలపాడులో ఘటన జరిగింది. రామాలయ నిర్మాణ పనుల కోసం వచ్చామని చెప్పినా వినిపించుకోకుండా కార్మికుడిపై దాడి జరిపారని బాధితుడు పేర్కొన్నాడు.

## స్టీల్ ప్లాంట్లో జరిగిన ఘటన దురదృష్టకరం మంత్రి వాసంశెట్టి సుభాష్

**విశాఖపట్నం :** విశాఖ స్టీల్ ప్లాంట్లో జరిగిన ఘటన దురదృష్టకరం. ప్రమాదంలో గాయపడిన ముగ్గురు ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంత్రి మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందుతోంది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాం. గాయపడిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తాం. కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ప్రమాదం జరిగిన సమయంలో అవసరమైన సంఖ్యలోనే కార్మికులు విధుల్లో ఉన్నారు. ప్లాంట్లో భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాం. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు.

## జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల జట్టు ఎంపిక

**సిరికొండ :** కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో ఈ నెల 11 నుండి 14 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్‌బాల్ కప్ ఇండియా --2026 పోటీలకు సత్యశోధక్ పాఠశాల జట్టు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం జట్టును అభినందించారు.గత ఏప్రిల్ నెల 23 నుండి 26 వరకు ఆర్మూర్ క్రీడా మైదానంలో నిర్వహించిన నిజామాబాద్ రీజినల్ ఉభయ రాష్ట్రాల మేజర్ లీగ్ బేస్‌బాల్ కప్ ఇండియా అండర్--11 ఛాంపియన్‌షిప్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి గ్రూప్ బి విజేతగా నిలిచి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన హర్షిత్, సతీష్, శివచరణ్, శ్రీరామ్, సాయి సృజన్, అభిరామ్, విశ్వక్ సేనా, విధ్వాన్, రిషివరుణ్ తేజ్, రిశ్విత్, పి. రిత్విక్, టి. రిత్విక్ లు సభ్యులుగా, పాఠశాల పి.ఈ.టి. ఉపాధ్యాయులు బాదావత్ సంతోష్, దండు అనిల్ లు కోచ్, మేనేజర్లుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు బెంగుళూరుకు వెళ్తున్న సత్యశోధక్ పాఠశాల జట్టు విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుండి జాతీయ స్థాయి వేదిక వరకు చేరుకోవడం గొప్ప విజయమని, విద్యార్థులు తమ క్రీడా ప్రతిభ, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తితో అత్యుత్తమ ప్రదర్శన చేసి విజయం సాధించుటకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీలు అనిల్, సంతోష్, విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో ఉద్యోగాలకు నియామక పరీక్షలు... 21 ఉద్యోగాలకు 155 దరఖాస్తులు

**హైదరాబాద్‌లో పరీక్షలు నిర్వహించిన అధికారులు**

**వేములవాడ :** వేములవాడ రాజన్న ఆలయంలోని పలు ఉద్యోగాలకు మంగళవారం నియామక పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉద్యోగ నియామకానికి కమిటీని నియమిస్తూ జీవోను ఉత్తరాలు జారీ చేశారు. అయితే రాజన్న ఆలయంలో వైష్ణవర్చక 2, తమ్మల అర్చక 2, బ్రాహ్మణ పరిచారిక 11, డోలు, సన్నాయి 5, బ్రాహ్మణ వంట మనిషి 1, తో కలిపి మొత్తం 21 ఉద్యోగ ఖాళీలు ఉండగా ఇందులో వైష్ణవ పరిచారికకు 7, తమ్మల పరిచారకకు 7, బ్రాహ్మణ పరిచారకకు 47, బ్రాహ్మణ వంట మనిషి ఉద్యోగానికి 5, డోలు 32, సన్నాయి, 22, శృతి 35 లతో కలిసి 155 మంది దరఖాస్తు చేసుకొని పరీక్షలకు హాజరయ్యారు.హైదరాబాద్ వార్తలు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ వ్రాత,

# అధికారం వస్తే సమాజాన్ని అణిచివేస్తున్న దుద్దిళ్ల శ్రీధర్..

## మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**ఫెర్టిలైజర్ :** మూడు ఓట్లు ఉన్న దుద్దిళ్ల శ్రీధర్ ఎప్పుడు అధికారంలో ఉంటే అప్పుడు ఈ సమాజాన్ని అణిచివేస్తూ తొక్కిపెడుతూ ఎవరు మాట్లాడితే వాళ్లను జైలుపాలు చేస్తూ రాజ్యమేలుతున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకుడు, కమాన్‌పూర్ మార్కెట్ కమటి మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్‌ను మంగళవారం తెల్లవారుజామున అక్రమంగా అరెస్ట్ చేయడంతో రామగుండం సీపీ కార్యాలయం చేరుకొని ఆయన మీడియాతో మాట్లాడారు. పదేండ్లు ప్రశాంతంగా ఉన్న మంథనిని అల్లకల్లోలం చేస్తున్నారని, ప్రతీ రోజు ఏదో ఒక విధ్వంసంతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌లో బండి రాజు అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలో అక్రమంగా పూదరి సత్యనారాయణగౌడ్‌ను అరెస్ట్ చేశారని, పూదరి అరెస్ట్ చెల్లదని ఇప్పటికే ఒకసారి జడ్జి చెప్పారని, ఈసారి కూడా జడ్జి పూదరి అరెస్ట్ చెల్లదని వెనక్కి పంపించారని, రామగుండం పోలీసులకు ఖాకీ దుస్తులు వేసుకునే నైతిక హక్కు లేదని, ఇప్పుడు పోలీసులు తల ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. హైదరాబాద్ వార్తలు

ఈనాడు మంథనిలో దుద్దిళ్ల శ్రీధర్ రాజ్యంగం, పోలీసుల రాజ్యం నడస్తుందని అంబేద్కర్ రాసిన రాజ్యాంగం నడుస్తలేదన్నారు. రాజ్యాంగం బుక్కు పట్టుకుని దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ మంథనికి వచ్చి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పట్టుకునే కర్ణాటక ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిండని, మంథనిలో రాజ్యాంగాన్ని వంచించి అవమానపర్చి చేతులో పట్టకున్నందుకు సిగ్గు పడాలన్నారు. గతంలో దుద్దిళ్ల శ్రీధర్, ఆయన జోకర్ తమ్ముడు కలిసి తనపై రౌడీషీట్ పెట్టించాడని, అయినా తాము వాళ్లను, వాళ్ల అడుగులకు మడుగులు ఒత్తిన పోలీసులను వదిలిపెట్టామని అన్నారు. కానీ పూదరి సత్యనారాయణను రాత్రి రెండు గంటలకు పట్టుకు వచ్చిన దుద్దిళ్ల శ్రీధర్, ఆయన తమ్ముడు హైదరాబాద్‌లో ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని, వాళ్లకు వత్తాసు పలుకుతున్న పోలీసులను వదిలిపెట్టమని హెచ్చరించారు. దుద్దిళ్ల రాజ్యాంగం ఎక్కువ రోజులు నడువదని, ఇంకా రెండున్నర ఏండ్లు మాత్రమేనని, ఆ తర్వాత ఇదే రోడ్డు మీద మీ భార్య, తల్లి కూడా ఇక్కడ ఏడ్చే రోజులను తీసుకువస్తమని హెచ్చరించారు. గౌడ్స్, కాపు వర్గాల్లో మా వాళ్లలో వాళ్లకే తగువులాటలు పెట్టించి హైదరాబాద్‌లో దుద్దిళ్ల శ్రీధర్ మంట కాగుతున్నాడని ఆరోపించారు.

రామగుండం పోలీసులను ఇప్పటికే హెచ్చరించినా మార్పు రావడం లేదని మండిపడ్డారు. ఇప్పటికే జైలుభరో కార్యక్రమం పెడుతామని చెప్పామని, జైలుభరో పెడితే మమ్మల్ని జైల్లో పెట్టడానికి మీ జైల్లు సరిపోవని ఆయన అన్నారు. ఐపీఎస్ అధికారి అంటే రాజ్యాంగాన్ని రక్షించే విధంగా పని చేయాలని, కానీ ఇక్కడ ఐపీఎస్ అధికారి ఉన్నా రాజ్యాంగం అవమానపడుతుందంటే మీ యూనీఫాంకే అవమానం అని గమనించాలని, పూదరి సత్యనారాయణ అరెస్ట్ చెల్లదరి రెండోసారి కోర్టు జడ్జి వెనక్కి పంపించారని ఆయన గుర్తు చేశారు. ఆత్మహత్య చేసుకున్న బండి రాజు తమ్ముడు ఇచ్చిన స్టేట్ మెంట్, బాధిత కుటుంబానికి రూ. 25లక్షలు ఇస్తమని రాజు మృతికి కారకుడైన వ్యక్తి బాండ్ పేపర్ రాసి ఇచ్చారని ఆయన వివరించారు. అయితే రాజు ఆత్మహత్యకు కాంగ్రెస్ పార్టీ నాయకుడే కారకుడు కావడంతో బాధిత కుటుంబానికి ఇచ్చే రూ. 25లక్షలు ఇవ్వకుండా మోసం చేయడానికి, సదరు వ్యక్తిని కాపాడటానికి, దుద్దిళ్ల శ్రీధర్ కు వత్తాసు పలుకడానికి రాత్రికి రాత్రే పూదరి సత్యనారాయణను అరెస్ట్ చేశారని, ఏ–1ను వదిలిపెట్టి పూదరి సత్యనారాయణను అరెస్ట్ చేయడం ఇంత దౌర్భాగ్యమా అని ప్రశ్నించారు. ఆనాడు ఇక్కడ పని చేసిన ఎస్ఐలు, సీఐలను జైలుకు పంపడానికి దుద్దిళ్ల శ్రీధర్ కుట్రలు చేస్తే తాను కాపాడినా వాళ్లకు ఆ విశ్వాసం కూడా లేకుండా పోయిందని వాపోయారు. ఈ విషయంలో మంథని సీఐ రాజు, ఏసీపీ రమేష్‌ను మిమ్మల్ని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. మరో రెండున్నర ఏండ్లలో కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, పదేండ్లు తాము అధికారంలో ఉన్నప్పుడు పోలీసులతో కలిసి గొప్పగా సేవలు అందించామని ఓపిక పడుతుంటే అరాచకాలు చేస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆనాడు ఇక్కడ పని చేసిన పోలీసులు నిష్పక్షపాతంగా పని చేశారని, గంజాయి కుట్రకు ఇక్కడ సీపీగా ఉన్న దుగ్గల్ సహకరించడని దుద్దిళ్ల శ్రీధర్ హైదరాబాద్ పోలీసుల ఆశ్రయించిన విషయం గుర్తించాలన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ ఎప్పుడు అధికారంలో ఉంటే అప్పుడు పోలీసులను వాడుకుంటరని, రామగుండం సీపీ పరిధిలో పని చేసే వాళ్లతో అవమానాలు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఇప్పటికే కాటారం, భూపాలపల్లి జిల్లా, రామగుండం సీపీ పరిధిలోని పోలీసులు తమ కార్యకర్తలను కేసులతో అణిచివేయలేరని, దుద్దిళ్ల శ్రీధరో తామో తేల్చుకుటామన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా తనను తన భార్యను అంతం చేసే దాకా పోరాటం చేస్తూనే ఉంటమన్నారు. ఇప్పటికైనా పోలీసులు జాగ్రత్తగా ఉండాలని, రాజ్యాంగాన్ని అనుసరించి పని చేయాలని, ఖాకీ యూనీఫాం రక్షిస్తూ ప్రజలకు ఒక నమ్మకం కల్గించి గౌరవించేలా పని చేయాలని ఆయన హితవు పలికారు.

### బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెడితే శంకరిగిరి మాన్యాలే...మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టే పోలీసులకు శంకరగిరి మాన్యాలు తప్పవని, జీవితంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మదూకర్, నాయకులను,కార్యకర్తలను ఇబ్బంది పెట్టాలని చూస్తే ప్రజలు కన్నెర్ర జేస్తారని ఆయన అన్నారు. రామగుండం సీపీ పరిదిలోని సీఐలు, ఎస్సైలు కాంగ్రెస్ కండువాలు కప్పుకుని పని చేస్తున్నట్లు అర్థం అవుతోందని అన్నారు. ఆనాడు పూదరి సత్యనారాయణగౌడ్ పై పెట్టిన కేసును జడ్జి రిజెక్ట్ చేశారంటే పోలీసులు అవమానపడాలని ఆయన అన్నారు. శ్రీధర్‌బాబు, మక్కాన్ సింగ్ చెప్పారని పని చేస్తే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే పని చేయాల్సి ఉంటుందని గమనించాన్నారు. రామగుండం సీపీ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లకు కాంగ్రెస్ కార్యాలయలని బోర్డులు పెట్టే పరిస్థితి తీసుకురావద్దని, ఇక్కడి పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేసేలా సీపీ ఆదేశాలు జారీ చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# నత్త నడకన భద్రాద్రి ‘కొత్త వారధి’ పనులు

-- అప్రోచ్, సైడ్బర్మ్ పనుల్లో నాణ్యత లేమి

-- పనుల పరిశీలనలో కొరవడిన అధికారుల పర్యవేక్షణ

-- గోదావరికి వరదొస్తే వారధి నిర్మాణ పనుల ఖర్చు వృథాయేనా?

-- నెల రోజులు కావస్తున్నా కొత్త వారధిపై జరగని రాకపోకలు

**బూర్గంపహాడ్ :** పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో పది కాలాల పాటు ఉండాలన్న లక్ష్యంతో సారపాక- భద్రాచలం మధ్యలో కోట్ల రూపాయలతో నిర్మించిన కొత్త వారధికి ఇటీవల అప్రోచ్ కుంగి ఊడిపోవడంతో రాకపోకలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. అయితే నెల రోజులైనా ఈ అప్రోచ్ పనులతో పాటు సైడ్బర్మ్ పనులు నత్త నడకన సాగుతున్నాయని వాహనదారులు, భక్తులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం అన్ని అడ్డంకులను అధిగమించి వినియోగంలోకి వచ్చిన ఈ వంతెనకు ఇటీవల నెల రోజుల క్రితం అప్రోచ్ కుంగి రాత్రికి రాత్రే ఊడిపోవడంతో అధికారులు అప్రమత్తమై నూతన వంతెనపై రాకపోకలు నిలిపివేశారు. అయితే ఆనాటి నుంచి ఇప్పటివరకు ఆ పనులు ముమ్మరంగా చేపట్టకుండా నత్త నడకన సాగిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. చేస్తున్న మరమ్మతు పనుల్లో సైతం నాణ్యత పాటించడం లేదనే వాదనలూ భక్తులు, వాహనదారుల నుండి లేకపోలేదు. అప్రోచ్, సైడ్ బర్మ్ పనులకు వాడే మెటీరియల్ తో పాటు ఇతర సామగ్రిని నిబంధనలు పాటించకుండా నాణ్యత లేకుండా వాడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు వంతెన అప్రోచ్ పనులు జరుగుతుండడంతో కొత్త వారధి వైపు రాకపోకలు పూర్తిగా నిలిపివేసినప్పటికీ సరైన ప్రమాద సూచికలు రహదారిపై ఉంచకపోవడం, ఉంచినా రాత్రిళ్లు అవి అక్కడ లేకపోవడంతో భద్రాచలం వైపు వెళ్లే కార్లు, ఇతర వాహనాలు నూతన వారధి ఉన్న వైపు వెళుతుండడం, ముందుకు వెళ్లాక మట్టి గుట్టలు కనిపించి ఆగి తిరిగి పక్క నుండి వెళ్తూ ప్రాణాలను రక్షించుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. తెలియని వాహనదారులు ఆటువైపు వెళితే పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం లేకపోలేదు. రాత్రిళ్లు వాహనాలు అటువైపు వెళ్లకుండా ప్రమాద సూచికలు



పెట్టి పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత ఉందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

### కొరవడిన ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణ

భద్రాద్రి నూతన వంతెన అప్రోచ్ పనులు, సైడ్ బర్మ్ పనులను ఎన్హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉండగా పనుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని పలువురు మండిపడుతున్నారు. పది కాలాల పాటు ఉండాల్సిన నూతన బ్రిడ్జి నిర్మాణ విషయంలో ఆది నుంచి సంబంధిత శాఖ అధికారులు ఇదే పద్దతిని పాటిస్తున్నారనే ఆరోపణలు సైతం లేకపోలేదు. పనుల పర్యవేక్షణ చేయని, పాటించని విషయంలో సాక్షాత్తు రాష్ట్ర మంత్రి సంబంధిత అధికారులపై ఆగ్రహం సైతం వ్యక్తం చేశారు. ఆ సంఘటన జరిగిన కొన్ని నెలలకే వంతెన అప్రోచ్ కుంగిపోవడం... నెలరోజులైనా పనులు ముందుకు సాగకపోవడంపై ఇటు వాహనదారులు, అటు రామయ్య దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.

### వరదస్తే నిధులు నీళ్లపాలేనా?

ప్రతి ఏడాది గోదావరి వరదలు జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వస్తుంటాయి. భద్రాచలం-సారపాక నూతన వంతెన అప్రోచ్ కుంగిపోవడంతో నెల రోజులుగా మరమ్మతులు చేస్తున్నారు. అయితే పనులు నత్త నడకన సాగుతుండటంతో ఈ నెలాఖరు నుంచే వర్షాలు మొదలై ఎగువ ప్రాంతాల నుంచి గోదావరి వరదనీరు వచ్చి చేరితే అప్రోచ్ పనుల కోసం చేసిన లక్షల రూపాయల నిధులు నీళ్లపాలయ్యే అవకాశం లేకపోలేదని ఈ ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. వరదలొస్తాయని తెలిసినా ఎన్హెచ్ అధికారులు గుత్తేదారులతో ఈ మరమ్మతు పనులు త్వరితగతిన చేపట్టకుండా జాప్యం చేయడంలో అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కొత్త వారధిపై వాహన రాకపోకలు జరగకపోయినా హైమాస్ లైట్లు వెలుగులు ఉంటున్నాయని... పాత వారధిపై కొన్ని లైట్లు వెలగడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కొత్త వారధిపై లైట్లు వెలగకుండా చూసి పాత వారధిపై మరమ్మతులకు గురైన లైట్లు బాగుచేయిస్తే మంచిదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి అప్రోచ్ పనుల్లో నాణ్యత పాటించేలా గుత్తేదారులను పర్యవేక్షించాలని, సరైన మెటీరియల్ వాడేలా చూడాలని, త్వరలో నూతన వారధిపై రాకపోకలు సాగేలా చూడాలని వాహనదారులు, భక్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## కరాటే విద్యార్థినికి ఎమ్మెల్యే విజయరమణారావు అభినందన



**కాల్వశ్రీరాంపూర్ :** కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రుషిగాని వినూత్న నేపాల్ రాజధాని ఖాట్మండులో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో అండర్-12 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. అంతర్జాతీయ వేదికపై రాణించి దేశానికి, పెద్దపల్లి నియోజకవర్గానికి పేరు తెచ్చిన కరాటే విద్యార్థిని వినూత్నను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మంగళవారం కాల్వశ్రీరాంపూర్ లో ప్రత్యేకంగా అభినందించారు. వినూత్నను శాలువాతో సన్మానించి, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే ఇంతటి ప్రతిభ కనబరిచిన వినూత్న, ఆమె తల్లిదండ్రులను మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు.

### కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 66 మంది లబ్ధిదారులకు రూ. 66,07,656ల విలువ గల కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ప్రభుత్వ విప్, పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాముడు, ఎంపీడీవో దివ్య సుదర్శన్ రావు, ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ‘ఈ 20న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలి’



**ఇల్లెందు :** ఈనె ల 20వ తేదీన ఇల్లెందు కోర్టు పరిధిలో జరుగు జాతీయ మెగా లోక్ అదాలత్‌ను జయప్రదం చెయ్యాలని జడ్జి స్వరూప కాటం కోరారు. మంగళవారం స్థానిక ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో సాయంత్రం ఇల్లెందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇల్లెందు కోర్టు పరిధిలో గల వివిధ పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్. ఓ. లతో కో ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జడ్జి స్వరూప కాటం ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడారు. ఈ నెల 20న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా అందరూ ఎస్. హెచ్. ఓ. లు బాధ్యతగా సహకరించి రాజీ పడదగిన కేసులను ఇరువర్గాలను సమన్వయ పరిచి, ఆయా స్టేషన్లలో కౌన్సిలింగ్ నిర్వహించి, పెద్ద మొత్తంలో కేసులు రాజీపడే విధంగా కృషి చేసి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ రామకృష్ణ, కోర్టు పరిధిలోగల పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్. ఓ. లు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, యాష్ ట్యాంకర్.. ?ఇద్దరు డ్రైవర్లకు తీవ్రగాయాలు







**జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. హైదరాబాద్ నుండి భద్రాచలం వెళ్తున్న భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, కొత్తగూడెం నుండి జగ్గయ్యపేట వైపు వెళ్తున్న యాష్ ట్యాంకర్ లారీ మాచినేనిపేట తండా సమీపంలోకి రాగానే అదుపుతప్పి ఎదురెదురుగా బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదం ధాటికి రెండు వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఆ సమయంలో బస్సులో ఉన్న 42 మంది ప్రయాణికులు ఎటువంటి ప్రాణాపాయం లేకుండా సురక్షితంగా బయటపడడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. హైదరాబాద్ వార్తలు కాగా ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఇల్లెందుకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ సాంబశివరావుతో పాటు, ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ధర్మాలపాడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కోటయ్యకు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డుపై ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించి ప్రమాదం జరిగిన తీరుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




## నాని ‘ది పారడైజ్’ మళ్లీ వాయిదా? రవితేజ ‘ఇరుముడి’ కోసమేనా!


నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘ది పారడైజ్’ మరోసారి వాయిదా పడే దిశగా కనిపిస్తోంది. మొదట మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రం, ఆ తర్వాత ఆగస్టు 21కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఆగస్టు 21వ తేదీని మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న ‘ఇరుముడి’ సినిమా లాక్ చేసుకోవడంతో నాని సినిమా పోస్ట్‌పోన్ కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సినిమాకు సంబంధించిన కొంత వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం.. ‘ది పారడైజ్’ చిత్రం సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ప్రచారం మాత్రమేనని, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని ఇండస్ట్రీ టాక్. బ్లాక్‌బస్టర్ ‘దసరా’ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ‘ది పారడైజ్’ పై భారీ అంచనాలు ఉన్నాయి. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయాదు లోహర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.

# ‘పెద్ది’కి మళ్లీ రిపేర్లు.. సెకండాఫ్‌లో కీలక మార్పులు, కొత్త వెర్షన్ సిద్ధం!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ, సినిమా కంటెంట్ విషయంలో వచ్చిన విమర్శలను మేకర్స్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చిన నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని మరింత మెరుగుపరచే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు గురయ్యాయి. హీరోయిన్‌ను చూపించిన తీరు, కొన్ని షాట్లపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో దర్శకుడు బుచ్చిబాబు క్షమాపణలు చెబుతూ ఆ సన్నివేశాలను తొలగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం థియేటర్లలో ఆ మార్పులతో కూడిన వెర్షన్ ప్రదర్శితమవుతోంది. అయితే తాజా సమాచారం ప్రకారం, ‘పెద్ది’లో మార్పులు అక్కడితో ఆగలేదని తెలుస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్ నిడివి, కథనం వేగంపై ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను దృష్టిలో పెట్టుకుని మరిన్ని ఎడిటింగ్ మార్పులు చేయాలని చిత్రబృందం నిర్ణయించినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో సెకండాఫ్‌లో వచ్చే కొన్ని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌ను తగ్గించి, వాటి స్థానంలో రామ్ చరణ్ మరియు జగపతి బాబు పాత్రల మధ్య భావోద్వేగపూరిత సన్నివేశాలను జోడించే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని సమాచారం. ఈ మార్పులతో కథ మరింత బలంగా, భావోద్వేగంగా కనెక్ట్ అవుతుందని భావిస్తున్నారట. అలాగే సినిమాలోని కొన్ని నెమ్మదిగా సాగిన భాగాలను కత్తిరించి, కథనాన్ని మరింత రేసీగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల దృష్టిని నిలబెట్టేలా సెకండాఫ్‌ను మరింత గ్రిప్పింగ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ మార్పులు చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఎడిటింగ్ పనులు పూర్తయిన తర్వాత చిత్రానికి మళ్లీ సెన్సార్ అనుమతి తీసుకుని, కొత్త వెర్షన్‌ను థియేటర్లలో ప్రదర్శించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వీలైనంత త్వరగా, ముఖ్యంగా వచ్చే వీకెండ్‌కు ముందే ఈ అప్‌డేటెడ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, మిశ్రమ టాక్ వచ్చినప్పటికీ ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు చేస్తూ ముందుకు సాగుతోంది. ఇప్పుడు ఈ కొత్త మార్పులు సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తాయా? కలెక్షన్లపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

## దేశ విభజన నేపథ్యంలో సన్నీ డియోల్ ‘బట్వారా 1947’.. విడుదల తేదీ ఖరారు!






బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా చిత్రం నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటివరకు ‘లాహోర్ 1947’ అనే వర్కింగ్ టైటిల్‌తో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా పేరును అధికారికంగా ‘బట్వారా 1947’ గా మారుస్తూ చిత్రబృందం సరికొత్త మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే ఈ భావోద్వేగభరితమైన చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో ‘ఘాయల్’, ‘దామిని’, ‘ఘాతక్’ వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన ‘ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్’ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

# ‘వీడి అనుమానంలో మనం విడిపోయేలా ఉన్నాం’



యంగ్ హీరో రాగ్ మయూర్ నటించిన లేటేస్ట్ సైకాలాజికల్ కామెడీ ఎంటర్‌టైనర్ అనుమాన పక్షి. ఈ సినిమాకు విమల్ కృష్ణ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని రాజీవ్ చిలకా, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్ నిర్మించారు. ఈ చిత్రంలో మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటించింది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. తాజాగా రిలీజైన టీజర్ చూస్తుంటే ప్రతి విషయానికి అనుమానపడే వ్యక్తిగా హీరో రాగ్ మయూర్ కనిపించారు. ప్రతిదాన్ని అనుమానించే హీరో పెళ్లి విషయంలో ఏం చేశారనే నేపథ్యంలోనే ఈ మూవీని తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. ఈ మూవీలో ప్రిన్స్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, రాశి, ?అజయ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూలై 10న థియేటర్లలో సందడి చేయనుంది.

## నాగ చైతన్య సూపర్ హిట్ థ్రిల్లర్ సిరీస్‌పై క్రేజీ బజ్ ..

### ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ జత కట్టిన క్రేజీ కాంబో

అక్కినేని యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒకవైపు భారీ థ్రిల్లర్ మూవీ ‘వృష కర్మ’లో నటిస్తూనే, మరోవైపు తన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఓటీటీ సిరీస్ ‘దూత’ రెండో సీజన్ కోసం కూడా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రారంభమైన ‘దూత 2’పై రోజురోజుకు ఆసక్తికరమైన వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. దర్శకుడు విక్రమ్ కె కుమార్ తెరకెక్కించిన ‘దూత’ తొలి సీజన్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణను సొంతం చేసుకుంది. హారర్, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల కలయికతో రూపొందిన ఈ సిరీస్ ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా, నాగ చైతన్యకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు రెండో సీజన్ మరింత భారీ స్థాయిలో తెరకెక్కనున్నట్లు సమాచారం. తాజాగా సినీ వర్గాల్లో వినిపిస్తున్న వార్తల ప్రకారం, ప్రముఖ నటి భూమిక చావ్లా ‘దూత 2’లో కీలక పాత్ర పోషించనున్నారట. ఈ విషయంపై అధికారిక ప్రకటన రానప్పటికీ, భూమిక పాత్ర కథలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, నాగ చైతన్య-భూమిక కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులను అలరించనుంది. ఇప్పటికే 2018లో వచ్చిన ‘సవ్యసాచి’ చిత్రంలో నాగ చైతన్యతో కలిసి నటించిన భూమిక, ఇప్పుడు ‘దూత 2’లో మరో ఆసక్తికరమైన పాత్రలో కనిపించబోతున్నారని టాక్. ఆమె పాత్ర కథనంలో కీలక మలుపులకు కారణమవుతుందని కూడా సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి సీజన్‌లో ప్రింట్ మీడియా, వార్తాపత్రికల నేపథ్యంలో సాగే భయానక మిస్టరీని దర్శకుడు విక్రమ్ కె కుమార్ అద్భుతంగా చూపించారు. జరగబోయే ఘటనలను ముందుగానే చెప్పే వార్తాపత్రికల కాన్సెప్ట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు రెండో సీజన్‌లో పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి దర్శకుడు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అత్యాధునిక టెక్నాలజీ, డిజిటల్ ప్రపంచం లేదా మరొక వినూత్నమైన అంశాన్ని కథలో భాగం చేయనున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే మేకర్స్ మాత్రం కథకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. ఇక ఈ సిరీస్ మరో ప్రత్యేకత ఏమిటంటే, నాగ చైతన్య కేవలం హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన కెరీర్‌లో నిర్మాతగా ప్రారంభించిన తొలి ప్రాజెక్ట్ ‘దూత 2’ కావడం విశేషం. దీంతో ఈ సిరీస్‌పై చైతన్య ప్రత్యేక శ్రద్ధ పెట్టుతున్నట్లు సమాచారం.


PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PUBLICATIONS. AT M/S SMIL YS ONLINE H.NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500 O70 AND PUBLISHED AT VIPLAV MEDIA PUBLICATIONS. H.NO : 18-7-496 KANDIKAL GATE, UPPUGUDA, HYDERABAD, TELANGANA - 500 053. CEO & CHIEF EDITOR VANGA NAGARAJ REDDY (RAJU), EDITOR VANGA VIPLAV TEJA. PRGI : TGBIL/26/A2289. PHONE NO: +9184990 94183, +9193945 17061